సంపుటి 6, సంచిక 24
న్యూ ఇండియా
# సమాచార్
జూన్ 16 - 30, 2026
ఉచిత పంపిణీ కోసం






ఇ-కాపీ కోసం

12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

## ఆరోగ్యవంతమైన ప్రపంచానికి భారత్ అందించిన కాలాతీత సూత్రం

అంతర్జాతీయ యోగా దినోత్సవం--మానవాళి భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక సంక్షేమాన్ని కోరుతూ ప్రపంచం యావత్తు చేసుకునే ఈ వేడుక... విభిన్న దేశాలు, సంస్కృతులను అనుసంధానం చేసే శక్తిమంతమైన మాధ్యమంగా మారింది. భారతదేశం అందించిన ఈ పురాతన కానుక నేడు ప్రపంచవ్యాప్త ఉద్యమంగా మారింది. మెరుగైన ప్రజారోగ్యానికి, అంతర్గత శాంతికి సరికొత్త మార్గాలు తెరిచింది.

Follow Us @NISPIBIndia



# ఉజ్వలమైన చోళ సామ్రాజ్యం: చరిత్ర, సంస్కృతులకు గర్వకారణం

***రేడియోలో ప్రసారమయ్యే ప్రముఖ కార్యక్రమం "మన్ కీ బాత్"కి ప్రతీ నెలా దేశంలోని భిన్న ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సందేశాలు వస్తూ ఉంటాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ఆసక్తికరమైన అంశాలపై పౌరులతో సంభాషిస్తూ ఉంటారు. 2026 మే 31వ తేదీన ప్రసారమైన "మన్ కీ బాత్" 134వ ఎపిసోడ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేసవి వేడి నుంచి రక్షణకు సంబంధించిన సలహాలు పంచుకుంటూ ఎల్లప్పుడూ తగినంతగా నీరు తాగుతూ ఉండాలని ప్రేక్షకులకు సూచించారు. చోళ సామ్రాజ్య కాలం నాటి మహోజ్వల చరిత్ర, సంస్కృతి సహా అనేక విశేషమైన అంశాలపై ఆయన మాట్లాడారు. "మన్ కీ బాత్" కార్యక్రమం ప్రధానాంశాలు ఇక్కడ అందిస్తున్నాం.***

- **జాతీయ రికార్డులు:** నేషనల్ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీలు ఝార్ఖండ్ లోని రాంచిలో జరిగాయి. దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన సుమారు 800 మంది అథ్లెట్లు ఈ క్రీడోత్సవంలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో విభిన్న అంశాల్లో నాలుగు జాతీయ రికార్డులు నెలకొల్పారు.

- **వేడి నుంచి రక్షణ:** ప్రస్తుతం దేశంలోని పలు ప్రాంతాల్లో వడగాలుల తీవ్రత చాలా అధికంగా ఉంది. ఎండ తీవ్రత, వేడి గాలులతో కూడిన ఇలాంటి వాతావరణం నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవడం అత్యంత కీలకం. బాగా నీరు తాగుతూ శరీరానికి తగినంత నీరు అందించండి. ఒకవేళ తప్పనిసరయి బయటకు వెళ్లినా తగినన్ని జాగ్రత్తలు తీసుకోండి. వేడి నుంచి రక్షణ కోసం వివిధ ప్రభుత్వ విభాగాలు జారీ చేసే మార్గదర్శకాలు పాటిస్తూ ఉండండి.

- **సత్తు షర్బత్:** బిహార్, ఝార్ఖండ్, తూర్పు ఉత్తర్ ప్రదేశ్‌లలో సత్తు షర్బత్ అద్భుతంగా ఉంటుంది. అది కడుపు నింపడంతో పాటు శరీరానికి బలం అందిస్తుంది.

- **రాగి పళ్లాలు:** నా నెదర్లాండ్స్ సందర్శన సమయంలో ప్రతీ భారతీయుని హృదయం గర్వంతో ఉప్పొంగే క్షణం ఒకటి చోటు చేసుకుంది. అక్కడ జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో చోళుల శకం నాటి పురాతన రాగి పళ్లాలను తిరిగి భారత్‌కు అప్పగించారు.

- **ఖగోళ శాస్త్రం:** మన దేశంలో ఖగోళ శాస్త్రం ప్రతీ తరంలోనూ ఉత్సుకతను రేపింది. ఇది శాస్త్రీయ అన్వేషణను ఉత్తేజితం చేయడంతో పాటు నేటి యువతరం ఈ శాస్త్రం పట్ల ఉత్సుకత ప్రదర్శిస్తోంది.

- **డాల్ఫిన్స్:** ఒక మొబైల్ ఆస్పత్రిగా పని చేయడానికి వీలుగా డాల్ఫిన్స్ రక్షణ అంబులెన్స్ ను డిజైన్ చేశారు. ఆక్సిజన్ సదుపాయంతో పాటు ప్రత్యేకంగా డిజైన్ చేసిన స్ట్రెచర్లు, వాటి రక్షణకు అవసరమైన పరికరాలు అందులో ఉన్నాయి. డాల్ఫిన్లు గాయపడినా, ఏదైనా కాల్వలో చిక్కుకుపోయినా తక్షణ సహాయం అందించేందుకు ఇది వీలు కల్పిస్తుంది.

- **జీవ వైవిధ్యం:** గంగానదిలో ఉండే డాల్ఫిన్లను మనం కాపాడినట్లయితే ఒక ప్రాణిని రక్షించడమే కాదు...గంగానదిలో జీవ వైవిధ్యాన్ని కూడా కాపాడినట్లవుతుంది. ఇలాంటి చర్య గంగానది పరీవాహక ప్రాంతంలో మొత్తం వాతావరణాన్ని పరిరక్షించడంతో పాటు భవిష్యత్తు తరాలకు ఎంతో విలువైన ప్రాకృతిక వారసత్వాన్ని కాపాడగలుగుతాం.

- **సేవ చేయడానికి అపారమైన వనరులు అవసరం లేదు:** కేరళంలోని అలువాలో సాజీ వలషెరిల్ 15,000 మందికి ఈత నేర్పారు. ఒక నదిలో జరిగిన పడవ ప్రమాదంలో పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన ద్వారా ఏర్పడిన విషాదం అనంతరం ఆయన ఈ కార్యక్రమం ప్రారంభించారు. సేవ చేసేందుకు విస్తృత వనరులు అవసరం లేదని ఆయన జీవితం మనకి బోధిస్తుంది. నిజానికి సేవ చేయడానికి కావలసింది ఒక మహోన్నతమైన లక్ష్యం, దృఢమైన పట్టుదల మాత్రమే.

- **దేశభక్తి స్ఫూర్తి:** గిరిజా అమ్మ సుమారు 15 పాఠశాలలు నిర్వహిస్తోంది. వాటిలో చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విశ్వవిద్యాలయం ప్రముఖంగా నిలుస్తుంది. ఆమెలోని దేశభక్తి స్ఫూర్తి ప్రతీ ఒక్క భారత పౌరునికి ఉత్తేజంగా నిలుస్తుంది.

- **ప్రజా శక్తి:** దేశంలోని ప్రతి గ్రామంలోను, నగరంలోను ఏదో ఒక స్ఫూర్తిదాయకమైన సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉంటాయి. తరచుగా ఇటువంటి ప్రయత్నాలు పెద్దగా వెలుగులోకి రాకపోవచ్చు; కానీ వాటిని మనం గమనించినప్పుడు మాత్రం ప్రజల సమిష్టి శక్తితో మన దేశం పురోగమిస్తోందన్న నమ్మకం బలపడుతుంది.

- **మంచి పనులు:** ఇలాంటి చర్యలు ఏవైనా మీ పరిసరాల్లో జరుగుతున్నాయేమో నిశితంగా పరిశీలిస్తూ ఉండండి. సమాజం కోసం మంచి పనులు చేస్తున్న వారిని గుర్తించి వారి ప్రయత్నాలను ప్రోత్సహించండి. వారి నుంచి నేర్చుకోండి. అవకాశం ఉంటే వారితో చేతులు కలిపి మంచి పనులకు మీ వంతు సహకారం అందించండి.

*"మన్ కీ బాత్" కోసం*
*ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి*

న్యూ ఇండియా
# సమాచార్
సంపుటి 6, సంచిక 23 | జూన్ 1-15, 2026



సంపాదకులు
ధీరేంద్ర ఓఝా
ప్రిన్సిపల్ డైరెక్టర్ జనరల్,
పత్రికా సమాచార కార్యాలయం,
న్యూఢిల్లీ

సీనియర్ కన్సల్టింగ్ ఎడిటర్
సంతోష్ కుమార్

సీనియర్ అసిస్టెంట్ కన్సల్టింగ్ ఎడిటర్
పవన్ కుమార్

అసిస్టెంట్ కన్సల్టింగ్ ఎడిటర్స్
అఖిలేష్ కుమార్
చందన్ కుమార్ చౌదరి

లాంగ్వేజ్ ఎడిటర్లు
సుమిత్ కుమార్ (ఇంగ్లీష్)
రజనీశ్ మిశ్రా (ఇంగ్లీష్)
నదీమ్ అహ్మద్ (ఉర్దూ)

సీనియర్ డిజైనర్
ఫూల్ చంద్ తివారీ

డిజైనర్స్
అభయ్ గుప్తా
సత్యమ్ సింగ్




13 భాషల్లో అందుబాటులో ఉన్న
'న్యూ ఇండియా సమాచార్'
చదవటానికి ఈ కింది లింక్ క్లిక్
చేయండి
https://newindiasamachar.pib.gov.in/news.aspx

'న్యూ ఇండియా సమాచార్' పాత సంచికలను
చదవటానికి ఈ కింది లింక్ క్లిక్ చేయండి:
https://newindiasamachar.pib.gov.in.archive.aspx

'న్యూ ఇండియా సమాచార్' పై
ఎప్పటికప్పుడు సమాచారం
తెలుసుకునేందుకు 'X' లో
@NISPIBIndiaను
అనుసరించండి.

## లోపలి పేజీల్లో...



**ముఖపత్ర కథనం**

ఈ ఏడాది జూన్ 21వ తేదీ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం... ఎంతో ప్రత్యేకత సంతరించుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ జూన్ మాసం ఒక వేడుకగా నిలుస్తుంది.

| 8-17

**పద్మ అవార్డులు 2026**



### జాతీయ ధీరులకు సత్కారం...



ఘనంగా జరిగిన ఒక పౌర సన్మాన కార్యక్రమం-1లో 66 మంది ప్రముఖులకు పద్మ అవార్డులు 2026 ప్రదానం చేశారు.

|22-27


**సంక్షిప్త సమాచారం** |4-5


**వ్యక్తిత్వం: వినీతా సోరెన్**
ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన తొలి భారతీయ గిరిజన మహిళ |6

**నిరంతర పర్యవేక్షణ, ప్రజా భాగస్వామ్యానికి పెద్దపీట**
51వ 'ప్రగతి' సమావేశానికి అధ్యక్షత వహించిన పిఎం నరేంద్ర మోదీ |7

**యువత నిరంతర పురోగతి: అభివృద్ధి చెందిన భారత్‌కు బలం**
రోజ్‌గార్ మేళాలో 51,000లకు పైగా నియామక పత్రాలు అందజేత |18-19

**ఆహార భద్రత, స్వచ్ఛ రవాణాకు నూతనోత్తేజం**
కేంద్ర మంత్రిమండలి సమావేశంలో కీలక నిర్ణయాలు |20-21

**యూరప్ నుంచి గల్ఫ్ వరకు**
ఎదుగుతున్న భారత శక్తికి నిదర్శనం
యుఏఇ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ దేశాల్లో పిఎం నరేంద్ర మోదీ పర్యటన భారతదేశ నూతన ప్రపంచ వ్యూహానికి శక్తిమంతమైన ప్రతీక. |28-32


**Published:** Kanchan Prasad, Director General, on behalf of Central Bureau of Communication
**Communication Address :** Room No–1077, Soochna Bhawan, CGO Complex, New Delhi -110003.
**E-Mail : response-nis@pib.gov.in, RNI No. :** DELENG/2020/78811

# సంపాదకీయం...

## యోగ: భారతదేశ ప్రాచీన వారసత్వం - ప్రపంచ గుర్తింపు

***నమస్కారం!***

జూన్ నెల వేడుకలను తన వెంట తెస్తుంది. ఒక వైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం, మరో వైపు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచం నిర్వహించుకుంటుండటం ఈ నెల ప్రత్యేకతలు. ఈ పవిత్ర 12 సంగమం ప్రస్తుత కాలాన్ని  అవకాశాలు, వేడుకల సంగమంగా మార్చింది.

వేగానికి మారుపేరైన ప్రస్తుత యుగంలో యోగా... మనసు, శరీరం, మేధస్సు, ఆత్మ మధ్య సమతుల్యత తెస్తుంది. తద్వారా వ్యక్తుల జీవితంలో శాంతి భావం పెంపొందిస్తుంది. వ్యక్తులను వారి కుటుంబంతో అనుసంధానం చేయడం ద్వారా యోగా ఆనందం, శ్రేయస్సుకు బాటలు వేస్తుంది. కుటుంబాల్లో సమాజం పట్ల సునిశితత్వాన్ని పెంచడం ద్వారా సామాజిక సామరస్యాన్ని పటిష్ఠం చేస్తుంది. అదే సమాజం జాతీయ ఐక్యతకు పునాదులు వేసి ప్రపంచం అంతటా శాంతి, మైత్రి సందేశం వ్యాపింపచేస్తుంది. ఆ రకంగా యోగా వ్యక్తిని, కుటుంబాన్ని, సమాజాన్ని, జాతిని, ప్రపంచాన్ని, యావత్ మానవాళిని అనుసంధానం చేసే శక్తిగా నిలుస్తుంది.

2014 సంవత్సరంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నాలకు ప్రపంచ సమాజం నుంచి అసాధారణ మద్దతు లభించింది. ఫలితంగా 2015 జూన్ 21 నుంచి ప్రతీ ఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. 5,000 సంవత్సరాల క్రితం నాటి భారతీయ యోగా సాంప్రదాయానికి ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ గుర్తింపును కల్పించింది. అప్పటి నుంచి యోగాతో అనుసంధానమైన ఆర్థిక కార్యకలాపాలు విస్తరించి ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక సాధికారతకు నూతనోత్తేజం ఏర్పడింది. నేడు యోగా భారత్ కు ప్రపంచ గుర్తింపుగా మారింది. ప్రతీ ఏడాది జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నారు. ఇదే ఈ సంచికలో ముఖపత్ర కథనం.

వ్యక్తిత్వ విభాగంలో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి భారతీయ గిరిజన మహిళ వినీతా సోరెన్ గురించి చదవండి. కేంద్ర మంత్రిమండలి నిర్ణయాలు, పిఎం విదేశీ పర్యటన, రోజ్ గార్ మేళా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన 51వ 'ప్రగతి' సమావేశం, గత 15 రోజుల్లో జరిగిన వివిధ కార్యక్రమాలు ఈ సంచికలోని ఇతర ప్రధానాంశాలు. ఇవి కాకుండా లోపలి పేజీలో 'మన్ కీ బాత్', ప్రతీ ఏటా జూన్ 27వ తేదీన నిర్వహించుకునే అంతర్జాతీయ ఎమ్ఎస్ఎమ్ఇ దినోత్సవ కథనం వెనుక కవర్ పేజీపై ప్రచురించాం.

***మీ అమూల్యమైన సలహాలు పంపుతూ ఉండండి.***




**(ధీరేంద్ర ఓఝా)**

**హిందీ, ఇంగ్లీషు సహా 11 భాషల్లో పత్రికను చదవండి/డౌన్ లోడ్ చేసుకోండి.**

*https://newindiasamachar.pib.gov.in/*

# మెయిల్ బాక్స్






### పాఠకుల హృదయాలను హత్తుకునే పత్రిక

ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్య పథకాలు, "నవ భారతం"లో ఉప్పొంగే శక్తికి సంబంధించిన కథనాలను "న్యూ ఇండియా సమాచార్" ప్రముఖంగా ప్రచురిస్తుంది. చక్కని అవగాహన కలిగిన పౌరుని దృక్పథంతో రాసిన ఈ నిర్మాణాత్మక సమాచారం పాఠకుల హృదయాలకు లోతుగా హత్తుకుంటుంది. ఎంతో విలువైన సమయాన్ని వెచ్చించి భారతదేశ పురోగతికి సంబంధించిన సమాచారాన్ని చక్కని రూపంలో తీర్చిదిద్ది పాఠకులకు అందించడంలో మీరు చేస్తున్న కృషికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

**రాజా ముత్యాల**
rajaa.muthyala@gmail.com

### స్ఫూర్తిదాయకమైన, ఉపయోగకరమైన పక్షపత్రిక ప్రచురిస్తున్నందుకు అభినందనలు

న్యూ ఇండియా సమాచార్ మే 1-15, 2026 సంచికలో "నవ భారతం, మహిళా-చోదక నాయకత్వం" పేరిట ముఖపత్ర కథనం ప్రచురించినందుకు హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. "నవభారతం"లో మహిళలు జాతి-నిర్మాణానికి అసలైన చోదక శక్తులుగా ఎలా మారుతున్నారన్న విషయాన్ని ఈ కథనం అద్భుతంగా వివరించింది. "ఆమె ముందుగానే నిర్దేశించిన కొన్ని పరిధులకే పరిమితం కాదు. అందుకు బదులుగా కొత్త బాటలు నిర్మించాల్సి ఉంటుంది" అన్న మాటలు ప్రత్యేకించి స్ఫూర్తిదాయకం. అలాగే నారీశక్తిని సాధికారం చేసి, మహిళా-ఆధారిత అభివృద్ధిని పటిష్ఠం చేసే దిశగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనికత, నిబద్ధతను ఈ వ్యాసం వెలుగులోకి తెచ్చింది. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన కథనం ప్రచురించినందుకు ఎడిటోరియల్ బృందానికి అభినందనలు.

michaelbks@gmail.com

### వేగంగా పురోగమిస్తున్న భారత్

న్యూ ఇండియా సమాచార్‌లో ప్రచురించిన ఒక వ్యాసం ఆన్ లైన్‌లో చదివే అవకాశం నాకు వచ్చింది. మన భారతదేశం వేగంగా పురోగమిస్తోంది. జాతి పురోగతికి మహిళలు తమ వంతుగా అందిస్తున్న కృషి చూసి నేనెంతో గర్విస్తున్నాను. "ఆపరేషన్ సిందూర్" ద్వారా ప్రపంచం యావత్తు భారతదేశ శక్తి ఏమిటో చూసింది.

jamesdevassy603@gmail.com

### అభివృద్ధికి సంబంధించిన తాజా వార్తలు ప్రచురిస్తున్నందుకు ఆనందంగా ఉంది

దేశంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని తెలియచేసే సమగ్ర సమాచారం ప్రచురిస్తున్నందుకు హృదయపూర్వక అభినందనలు. నేను ఈ పత్రికను క్రమం తప్పకుండా చదువుతుంటాను. దేశంలో తాజాగా చోటు చేసుకుంటున్న అభివృద్ధికి సంబంధించిన వార్తలు, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించిన తాజా సమాచారం అందించడం నాకు నిజంగా ఆనందంగా ఉంది.

**మన్మోహన్ బహెద్**
man.bahed82@gmail.com

### అభివృద్ధి బాటలో దేశం ముందుకు సాగుతోంది

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కాశీ విశ్వనాథుని దేవాలయంలో ఏర్పాటైన వైదిక గడియారానికి సంబంధించిన చారిత్రక ప్రాధాన్యత గురించి తొలిసారిగా నేను తెలుసుకున్నాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహణ తీరు, దార్శనికమైన ఆలోచనా ధోరణిలో భారతదేశం అభివృద్ధి బాటలో పురోగమించడం దేశ ప్రజల అదృష్టం. ఇది భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. భవిష్యత్ తరాలు దేశం గురించి తెలుసుకోగలుగుతాయి.

**నీరజ్ కుమార్ అగర్వాల్**
neerajagarwal951@gmail.com

ఉత్తర ప్రత్యుత్తరాల చిరునామా: రూమ్ నంబర్ -1077, సూచనా భవన్, సీజీఓ కాంప్లెక్స్, న్యూఢిల్లీ - 110003

**E-Mail: response-nis@pib.gov.in**



## వికసిత్ భారత్ - జూలై 1 నుంచి 'జీ రామ్ జీ' అమలు

గ్రామీణాభివృద్ధికి, దేశంలో ఉపాధి రంగానికి కొత్త దిశ కల్పించే "వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవికా మిషన్" లేదా "వికసిత్ భారత్ - జీ రామ్ జీ" చట్టం దేశవ్యాప్తంగా 2026 జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వస్తోంది. ఈ కొత్త చట్టంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతీ గృహంలోని వయోజనులు నైపుణ్యం లేని కార్మికులుగా పని చేయడానికి అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నట్లయితే వారికి ప్రతీ ఆర్థిక సంవత్సరంలోనూ 125 రోజుల పాటు వేతనంతో కూడిన ఉపాధి హామీ లభిస్తుంది. ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఏ ప్రస్తుతం అందిస్తున్న 100 రోజుల ఉపాధి హామీ కన్నా ఈ చట్టం అదనంగా మరో 25 రోజుల పని కల్పిస్తుందన్న మాట.

నిర్దిష్ట కాలపరిమితిలో డిమాండు ఆధారంగా కార్మికులకు ఉపాధి కల్పిస్తారు. ఉపాధి కల్పించలేని పక్షంలో చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా వారికి నిరుద్యోగ భృతి అందజేస్తారు. వారానికి ఒకసారి లేదా మస్టర్ రోల్ క్లోజ్ చేసిన 15 రోజుల్లోగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటి) విధానంలో వేతనాలు జమ చేస్తారు. చెల్లింపు కాలపరిమితికి కట్టుబడని పక్షంలో చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా జాప్యానికి నష్టపరిహారం పొందే హక్కు కూడా కార్మికులకు ఉంటుంది. "వికసిత్ భారత్ - జీ రామ్ జీ" పథకంలో భాగంగా కొత్త గ్రామీణ ఉపాధి హామీ కార్డులు జారీ అయ్యేంతవరకు ప్రస్తుతం అమలులో ఉన్న ఇ-కెవైసీ ధ్రువీకృత ఎమ్‌జీఎన్‌ఆర్‌ఈజీఏ జాబ్ కార్డులు చెల్లుబాటులో ఉంటాయి. ఇ-కెవైసీ పరిశీలన పెండింగులో ఉందన్న కారణంగా ఏ కార్మికునికి ఉపాధి నిరాకరణ జరగదు.

## భోపాల్‌లో నావల్ సెయిలింగ్ నోడ్ ప్రారంభం

భారత నౌకా దళం భోపాల్‌లో భోజ్ తాల్‌గా ప్రఖ్యాతమైన ఎగువ లేక్‌లో నౌకాదళ సెయిలింగ్ నోడ్ ను 2026 మే 17వ తేదీన ప్రారంభించింది. అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఈ సెయిలింగ్ నోడ్‌ను భారత నౌకాదళానికి, నేషనల్ కేడెట్ కోర్స్ కు (ఎన్‌సిసి) చెందిన సెయిలింగ్ బృందాలకు రోయింగ్, కానోయింగ్, కాయకింగ్‌లో శిక్షణ ఇవ్వడానికి విస్తృతంగా ఉపయోగిస్తారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న 34 మంది నౌకా దళ సెయిలింగ్ బృందంలో 17 మంది మధ్యప్రదేశ్ కు చెందిన వారే ఉన్నారు. భారీ సంఖ్యలో యువతను వాటర్ స్పోర్ట్స్ లో పాల్గొనేలా, రక్షణ దళాల్లో చేరేలా ప్రోత్సహించడం దీని లక్ష్యం. ఒలింపిక్, ఆసియా క్రీడోత్సవాలకు ప్రపంచ శ్రేణి క్రీడా ప్రతిభను అందించాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను సాకారం చేయడంలో ఇది విశిష్టమైన ముందడుగు అవుతుంది.




## "కాఫీస్ ఆఫ్ నాగాలాండ్" కార్యక్రమానికి శ్రీకారం

నాగాలాండ్‌లో క్లస్టర్ విధానంలో పని చేసే "విలువ ఆధారిత కాఫీ అభివృద్ధి మిషన్"ను ప్రారంభించారు. రూ.175 కోట్ల పెట్టుబడితో ఈ "కాఫీస్ ఆఫ్ నాగాలాండ్" కార్యక్రమం రూపొందించారు. కాఫీ ఉత్పత్తి చేసే వర్గాల క్షేత్రస్థాయి వాస్తవాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఈ మిషన్ కింద చర్యలు ఉంటాయి. క్లస్టర్ విధానంలో ఇది పని చేస్తుంది. దీనికి తోడు ఈశాన్య ప్రాంతాల అభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అరుణాచల్ ప్రదేశ్‌కు ప్రఖ్యాతమైన కివీ పంట అభివృద్ధి కోసం అరుణాచల్ కివీ ప్రాజెక్టును కూడా ప్రారంభించారు. ఇది కూడా క్లస్టర్ విధానంలోనే పని చేస్తుంది. దీన్ని క్లస్టర్ ఆధారిత కివీ సాగు, విలువ ఆధారిత అభివృద్ధి మిషన్ గా వ్యవహరిస్తారు.



# భారత్‌కు చెందిన తొలి స్వదేశీ హైడ్రోజన్ రైలు

భారతదేశంలో తొలి స్వదేశీ హైడ్రోజన్ రైలు పట్టాలెక్కడానికి సిద్ధంగా ఉంది. భవిష్యత్తులో రవాణాకు చిహ్నమైన ఈ పొగ రహిత, కాలుష్య రహిత రైలు గరిష్ఠంగా గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఉత్తర రైల్వేలో జింద్-సోనీపట్ పట్టణాల మధ్య 10 కోచ్ లతో తిరిగే ఈ హైడ్రోజన్ ఇంధన సెల్ ఆధారిత రైలు నడిపేందుకు భారతీయ రైల్వే అనుమతి ఇచ్చింది. రైల్వే రంగంలో కొత్త తరానికి చెందిన ఇంధన టెక్నాలజీ అభివృద్ధిలో ఇది విశిష్టమైన మలుపు అవుతుంది.

ఈ హైడ్రోజన్ రైలు చొరవతో స్వచ్ఛ రైల్వే రవాణాకు హైడ్రోజన్ ఇంధన వినియోగం అవకాశాలను అన్వేషిస్తున్న జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల సరసన భారత్ కూడా స్థానం సంపాదించుకుంది. "కొత్త ఆలోచనలు, సరికొత్త శక్తి"తో ముందడుగు వేస్తున్న "నవ భారతం"లో తయారైన ఈ హైడ్రోజన్ రైలు కేవలం నీటి ఆవిరిని మాత్రమే వాతావరణంలోకి వదులుతుంది. జీరో కర్బన వ్యర్థాల సాధన దిశగా భారతదేశ యానంలో ఒక విశిష్టమైన అధ్యాయానికి స్వచ్ఛ ఇంధన శక్తితో పని చేసే ఈ రైలు ఒక నిదర్శనంగా నిలుస్తుంది.




## జూన్ 30 వరకు దేశవ్యాప్తంగా "ఖేత్ బచావో అభియాన్"

"ఖేత్ బచావో అభియాన్" కేవలం ఒక చైతన్య కార్యక్రమం కాదు. వ్యవసాయాన్ని, రైతులను, గ్రామాలను అనుసంధానం చేసే ఒక సమగ్ర జాతీయ ప్రచారోద్యమం. దీన్ని దేశంలోని ప్రతీ గ్రామానికి వ్యాపింపచేస్తారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని... ప్రత్యేకించి సమతూకం లేకుండా వినియోగించడాన్ని తగ్గించడంపై ఈ ప్రచారం దృష్టి కేంద్రీకరిస్తుంది. ఈ ప్రచారోద్యమంలో భాగంగా భూసార పరీక్షల ఆధారంగా సమతూకంగా, క్రమబద్ధంగా ఎరువుల వినియోగంపై రైతులకు విభిన్న రూపాల్లో సమాచారం అందజేస్తారు.



## "జనాభా మార్పులపై అత్యున్నత స్థాయి కమిటీ" ఏర్పాటు

చొరబాట్లు, ఇతర అంశాల ఆధారంగా జనాభాలో సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా చోటు చేసుకునే మార్పులు ఏ జాతి వర్తమానం, భవిష్యత్తుకైనా సవాలు విసురుతాయి. ఈ సవాలును దీటుగా ఎదుర్కోవడం లక్ష్యంగా "జనాభాలో చోటు చేసుకుంటున్న మార్పులపై అధ్యయనానికి అత్యున్నత స్థాయి కమిటీ" ఏర్పాటు చేస్తున్నట్టు 2025 ఆగస్టు 15వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. 2025 సెప్టెంబర్ 11వ తేదీన ఈ ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం లభించింది. అందుకు అనుగుణంగా ప్రభుత్వం నేడు లాంఛనంగా ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అక్రమ వలసలు, ఇతర చట్ట వ్యతిరేక చర్యల కారణంగా దేశ జనాభాలో చోటు చేసుకుంటున్న మార్పులను ఈ కమిటీ సమగ్రంగా మదింపు చేస్తుంది. అలాగే కొన్ని మతాలు, సామాజిక వర్గాల్లో జనాభాపరంగా చోటు చేసుకుంటున్న అసాధారణమైన మార్పులను కూడా ఈ కమిటీ విశ్లేషిస్తుంది. ఈ సమస్యల పరిష్కారానికి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ఒక క్రమబద్ధమైన ప్రణాళికను కూడా అందచేస్తుంది. ●




# ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన
# తొలి భారత గిరిజన మహిళ


***ఝార్ఖండ్‌కు చెందిన వినీతా సోరెన్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి గిరిజన మహిళగా చరిత్ర సృష్టించారు. 25 సంవత్సరాల వయసులోనే వినీత అధిరోహించిన శిఖరాలు కఠోర శ్రమ, అసమాన సాహసానికి ప్రతీకలు. ప్రపంచంలోనే ఎత్తయిన ఈ శిఖరాన్ని అధిరోహించడం ద్వారా ఆమె కలలు సాకారం చేసుకోవడానికి సామాజిక పరిమితులు ఏవీ ఉండబోవని నిరూపించింది. ఝార్ఖండ్‌లోని ఒక కుగ్రామం నుంచి మొదలై ప్రపంచంలోని ఎత్తయిన శిఖరం వరకు ప్రయాణించిన వినీతా సోరెన్ యావత్తు దేశానికి చెందిన బాలికలకు ఒక స్ఫూర్తిగా మారింది.***

గిరిజన నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ వినీతా సోరెన్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం ద్వారా అసాధారణ విన్యాసం చేసింది. గిరిజన ప్రాంతాల్లోని ప్రజల జీవనం పొలాల్లో పని చేయడంపై ఆధారపడి ఉంటుంది. విద్యా సౌకర్యాలు పరిమితంగానే ఉంటాయి. కలలు సాకారం చేసుకునే అవకాశాలు కూడా పరిమితమే. అయితే వినీత కలలు మాత్రం ఎవరెస్ట్ శిఖరాన్ని మించి సాగిపోయాయి. 1987 జూన్ 21న జన్మించిన ఆమె కేవలం ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం కాదు... తనలోని అభిరుచి, శక్తి, బలీయమైన సంకల్పంతో భారత గిరిజన సమాజానికి కొత్త గుర్తింపును కూడా తెచ్చింది.

కొల్హాన్ ప్రాంత పుత్రిక అయిన వినీతా సోరెన్ బాల్యం పంట పొలాల్లోనే గడిచింది. ఆమె గ్రామంలోను, ఇరుగు పొరుగు గ్రామాల్లోను బాలికలకు అందుబాటులో ఉన్న ఏకైక అవకాశం ఉపాధ్యాయ వృత్తి లేదా నర్సింగ్. కాని ఆమె కలలు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఆమె ఎవరెస్ట్ శిఖరాన్ని చేరడానికి ముందు ఏడు సంవత్సరాల కఠోర శ్రమ చేసింది. కొండ శిఖరాలు అధిరోహించడం అంటే కేవలం శారీరక బలానికి పరీక్ష కాదు... మానసిక శక్తి, సాహసం, సంకల్ప బలాలకు పరీక్ష అని ఆమె ఈ సందర్భంగా నేర్చుకుంది. తీవ్రమైన చలి, మంచు కురిసే వాతావరణం ఆమె ముందు ఎన్నో సవాళ్లను నిలిపింది. తనకు స్పష్టమైన లక్ష్యం లేదని అప్పుడప్పుడూ ఆమె భావిస్తూ ఉండేది. కానీ, సాహసం, పట్టుదల, తపనలే ఆమెను దట్టమైన మంచు శిఖరాలతో కూడిన ప్రపంచంలోని ఎత్తయిన పర్వత శిఖరాగ్రాలకు చేర్చాయి.

2004వ సంవత్సరంలో వినీత తొలిసారిగా బచేంద్రి పాల్‌ను కలిసింది. ఆమె నుంచి పొందిన స్ఫూర్తితో తాను పర్వతారోహకురాలు కావాలన్న లక్ష్యం నిర్దేశించుకుంది. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన తొలి భారతీయ మహిళ బచేంద్రి పాల్ పర్వతారోహణలో వినీతకు శిక్షణ ఇచ్చారు. గిరిజన, వ్యవసాయ కుటుంబానికి చెందిన వినీతకు తొలుత పర్వతారోహకురాలు కావాలన్న ఆకాంక్ష లోపించింది. అసలు ఇంటిని వదిలి వెళ్లడమే ఆమెకు ఎవరెస్ట్ శిఖరం అధిరోహించడం వంటి సాహసం అయింది. కాని ఆమె కుటుంబం వినీతను విశ్వసించి, ఆ దిశగా ముందడుగు వేసేలా ప్రోత్సహించింది. కఠిన శిక్షణ అనంతరం ఎవరెస్ట్ శిఖరం అధిరోహించేందుకు ఆమె సిద్ధంగా ఉన్నట్లు బచేంద్రిపాల్ తెలిపారు. ఇక వినీత తనలోని ఆకాంక్షను అదుపు చేసుకోలేకపోయింది. ఎట్టకేలకు ఎవరెస్ట్ శిఖరానికి చేరుకుని విజయ పతాక ఎగురవేసింది. ఆ తర్వాత ఆమె ఎన్నో పర్వత శిఖరాలను కూడా అధిరోహించింది. నేడు ఆమె పేరుతో ఆమె కుటుంబానికి గుర్తింపు లభించింది.

ఝార్ఖండ్ లోని సరైకెలా ఖర్సావాన్ జిల్లాకు చెందిన కెశోర్సోవా గ్రామస్తురాలైన వినీతకు ఎవరెస్ట్ శిఖరం అధిరోహించేందుకు అవసరమైన సాధన సంపత్తులను టాటా స్టీల్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యతల్లో భాగంగా సమకూర్చింది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన 8,848 మీటర్ల శిఖరాన్ని ఒక గిరిజన మహిళ ఎక్కడమే ఒక రికార్డు. ఆమె సాధించిన విజయాలకు గుర్తింపుగా దేశంలోని భిన్న ప్రాంతాల నుంచి పలు పురస్కారాలు, అవార్డులు అందుకుంది. ●



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన 'ప్రగతి' 51వ సమావేశం

# నిరంతర పర్యవేక్షణ,
# ప్రజా భాగస్వామ్యానికి పెద్దపీట

***'ప్రగతి' (పిఆర్‌ఎజిఎటిఐ - ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్‌లీ ఇంప్లిమెంటేషన్... క్రియాశీల పరిపాలన, సకాలంలో అమలు) కేంద్ర ప్రభుత్వ డిజిటల్ పాలనలో ఒక కీలకమైన, సమర్ధవంతమైన వేదికగా మారింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన క్రమం తప్పకుండా సమావేశమవుతున్న 'ప్రగతి' వేదిక 2015 మార్చి నుంచి అనేక ప్రధాన ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయడంలోను కీలక పాత్ర పోషించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృషిని సమన్వయం చేస్తూ నిర్దిష్ట కాలపరిమితిలో ప్రాజెక్టులు అమలు పరిచేందుకు, మెరుగైన అమలుకు భరోసాగా నిర్వహించిన 51వ 'ప్రగతి' సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 27వ తేదీన అధ్యక్షత వహించారు....***

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఐసిటి ఆధారిత మల్టీ మోడల్ వేదిక 'ప్రగతి' (పిఆర్‌ఏజిఏటిఐ) 51వ సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన సుమారు రూ.30,000 కోట్ల ఉమ్మడి వ్యయంతో అమలులో ఉన్న ఏడు మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. వీటిలో రైల్వే, విద్యుత్, రోడ్డు ప్రాజెక్టులు ఉన్నాయి. ప్రభుత్వ ప్రాజెక్టుల అమలులో జాప్యం వల్ల వాటి వ్యయాలు పెరిగిపోవడమే కాకుండా సామాన్య పౌరులకు అవసరమైన సౌకర్యాలు అందించడంలో కూడా జాప్యం అవుతుందని ఈ సందర్భంగా పిఎం నరేంద్ర మోదీ నొక్కి చెప్పారు. ప్రాజెక్టుల్లో జరిగే ప్రతీ జాప్యం ప్రజల జీవితాలు, ప్రాంతీయ అభివృద్ధి, ప్రభుత్వ వనరులపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారంలో క్రియాశీల వైఖరి అనుసరించాలని; ప్రాజెక్టుల అమలులో లోటుపాట్లను సరిదిద్ది, పనులు పూర్తి చేయడంలో వేగం పెంచాలని ఆయన మంత్రిత్వ శాఖలు, ప్రభుత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

కెన్-బెత్వా నదుల ఇంటర్ లింకింగ్ ప్రాజెక్టు ఇతర రాష్ట్రాలకు ఒక నమూనాగా ఉండాలని, పరస్పర ఏకాభిప్రాయం ద్వారా రాష్ట్రాలు తమ మధ్య నదీ జలాల వివాదాలు పరిష్కరించుకునేందుకు దోహదకారి కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లు, 'గోబర్ ధన్' ప్లాంట్లు సహా ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయాలని ఆయన కోరారు. ఇదిలా ఉండగా ప్రధానమంత్రి సలహా మేరకు సామాజిక రంగ పథకాల నెలవారీ సమీక్షకు ఒక యంత్రాంగాన్ని రాష్ట్రాల స్థాయిలో ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ మిషన్ సమీక్షతో ఇది ప్రారంభమైంది.

## ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సమీక్షించిన కీలక ప్రాజెక్టులు

- రైల్వే, విద్యుత్తు, రహదారులు వంటి ఏడు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు.
- స్వచ్ఛ భారత్ మిషన్ - అర్బన్ 2.0; కెన్-బెత్వా లింక్ ప్రాజెక్టు.
- పట్టణ ప్రాంతాల్లో రూఫ్ టాప్ సోలార్ పరిధిని మిషన్ మోడ్‌లో విస్తరించాలని పిలుపు.

తొమ్మిది రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న **₹30,000** కోట్ల విలువ గల ప్రాజెక్టులు



**అంతర్జాతీయ యోగా దినోత్సవానికి 12 ఏళ్లు**

# ప్రపంచంలోనే అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవంగా ఉద్భవించిన యోగ

*"योगश्चित्तवृत्तिनिरोध:" అంటే- చిత్తం లేదా అంతరంగ ఆలోచన తరంగ అలజడిని నిశ్చలం చేసేదే యోగా అని అర్థం. దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలలో యోగ, ఆయుర్వేదం, ఇతర సంప్రదాయ వైద్య విధానాలను ఏకీకృతం చేస్తూ 2014లో ప్రత్యేక 'ఆయుష్' మంత్రిత్వశాఖ ఏర్పాటు కావడంతోపాటు 2015 జూన్ 21 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణకు శ్రీకారం చుట్టడాన్ని కూడా మానవాళి చరిత్రలో ఓ కీలక మలుపుగా పరిగణించవచ్చు. మన నాగరికతకు అనుపమాన ప్రతీక యోగ. మానవాళిని అన్ని విధాలా ఆరోగ్యంగా, సమతులంగా ఉంచే యోగ 'మృదు శక్తి'తో భారత్ నేడు ప్రపంచంపై అద్భుత ప్రభావం చూపుతోంది...*

*ఈ ఏడాది జూన్ 21న నిర్వహించే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం, యాదృచ్ఛికంగా మరో విశిష్ట ఘట్టానికి జోడైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్లు పూర్తి చేసుకోవడమే ఆ విశేష సందర్భం. కాబట్టి, అంబరమంటే సంబరాల మాసంగా ఈ జూన్ నెల ఓ ప్రత్యేకతను సంతరించుకుంది...*

సామాన్యులు-అసామాన్యులు... యువకులు-వృద్ధులు.. స్త్రీలు లేదా పిల్లలు, ఆస్తికులు లేదా నాస్తికులు... ఎవరైనా సరే- వారి జీవితాల్లో 'యోగ' నేడొక అంతర్భాగమైంది. అన్ని వయసుల వారి భౌతిక, బౌద్ధిక, మానసిక, భావోద్వేగ అస్తిత్వంతో అది మమేకమైంది. జాతి, మతం, కులం, ధనిక-పేద తారతమ్యం సహా సరిహద్దుల అతీత విశ్వ భాషగా యావత్ ప్రపంచానికీ విస్తరించింది. మహనీయుడైన సంస్కృత కవి భర్తృహరి శతాబ్దాల కిందటే తన 'శతక త్రయం'లో యోగా విశిష్ట లక్షణాలను ప్రస్తుతించారు.

धैर्यं यस्य पिता क्षमा च जननी शान्तिश्चिरं गेहिनी
सत्यं सूनुरयं दया च भगिनी भ्राता मनः संयमः।
शय्या भूमितलं दिशोऽपि वसनं ज्ञानामृतं भोजनं
एते यस्य कुटिम्बिनः वद सखे कस्माद् भयं योगिनः।।

శతాబ్దాల నాటి ఆ శ్లోకం ఏమంటుందంటే- యోగాభ్యాసం కొన్ని సద్గుణాలను మనకు ఆప్తబంధువులను చేస్తుంది.. ధైర్యాన్ని పెంచుతుంది.. తండ్రిలా సదా కాపాడుతుంది.. క్షమాగుణాన్ని ప్రోది చేస్తుంది.. తల్లి ప్రేమను తలపిస్తుంది.. మానసిక ప్రశాంతత కల్పిస్తూ స్థిరమైన తోడుగా నిలుస్తుంది. క్రమం తప్పని యోగాభ్యాసంతో సత్యమే సంతానంగా... కరుణ మన సోదరిగా, ఆత్మనిగ్రహం సోదరుడిగా, భూమి మనకు శయ్యగా, జ్ఞానం మన ఆకలి తీర్చే ఆహారంగా మారుతాయని భర్తృహరి విశదీకరించారు. ఇలాంటి అనేక సద్గుణాలు తోడైనపుడు అన్ని రకాల భయాందోళనలనూ యోగి నిస్సందేహంగా జయించగలడు.

ఉచిత ఆరోగ్య బీమా వాస్తవానికి అసాధ్యమే.. కానీ, యోగా మాత్రం ఎలాంటి ఖర్చుతో నిమిత్తం లేకుండా సంపూర్ణారోగ్యానికి పూర్తి భరోసానిస్తుంది. అందుకే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ- "ఈ శతాబ్దంలో ప్రపంచాన్ని యోగా ఏకం చేస్తున్న తీరుకు మనమంతా ప్రత్యక్ష సాక్షులం. శరీరం, మనస్సు, బుద్ధి,

ఆత్మల మధ్య సమతౌల్య సాధనకు ఎలా తోడ్పడుతున్నదో అదే తరహాలో ప్రపంచం మొత్తాన్నీ యోగా ఏకం చేస్తోంది.
ఒత్తిడి దరిచేరని, వ్యాధి రహిత, ఆనందమయ జీవనం ప్రతి ఒక్కరి ఆకాంక్ష. ఇది పరిపూర్ణం కావాలంటే మార్గం యోగా ఒక్కటే. సంపూర్ణ, సమతుల జీవనం గురించి తెలుసుకోవాలని, మనఃశరీరాలు, బుద్ధి, సత్ప్రవర్తన సహిత శ్రేయస్సు దిశగా అంతర్గత ప్రస్థానానుభవం పొందాలని ప్రగాఢంగా వాంఛించే వారికి– యోగా ద్వారా మాత్రమే అవన్నీ సాధ్యం” అని ఆయన వ్యాఖ్యానించారు.

యోగా శారీరక వ్యాయామాన్ని నిర్వచించే కసరత్తు కానేకాదు... తద్భిన్నంగా వ్యక్తి తనతోతానుగానే కాకుండా ప్రపంచంతో, ప్రకృతితో మమేకమయ్యే భావనాన్వేషణను ప్రతిబింబిస్తుంది. ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ పదవీ బాధ్యతలు స్వీకరించిన నాలుగు నెలల్లోనే.. అంటే– 2014 సెప్టెంబరు 27న యోగాను ప్రపంచ వేదికపైకి చేర్చడంలో చొరవ చూపారు. ఫలితంగా 2014 డిసెంబరులో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఆ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేయగా, జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటితమైంది.

## ప్రపంచ వేడుకగా మారిన యోగ

“**యోగః కర్మసు కౌశలం**” అంటే– అభ్యాసంతోనే నైపుణ్యం అబ్బుతుందని అర్థం. యోగాభ్యాసంతో జీవితంలో మరింత సామర్థ్యాన్ని సంతరించుకోవడం సాధ్యమని ఈ మంత్రం బోధిస్తుంది. క్రమశిక్షణతో కర్తవ్యం నిర్వర్తిస్తూ, విధులను నెరవేర్చడం కూడా ఒక యోగాభ్యాసమే. ఈ మంత్రానికి ప్రతీకగా నిలుస్తున్న భారత దేశం యోగాకు అంతర్జాతీయ గుర్తింపు సాధన ద్వారా దాన్నొక “మృదు శక్తి”గా సుస్థిరం చేసింది. అలాగే, యోగాను కర్మయోగంతో ముడిపెట్టి వ్యక్తిగత, సామాజిక, జాతీయ పురోగమన సామర్థ్యాన్ని బహుళం చేసింది.

ప్రపంచంలో అత్యంత ప్రభావశీలమైన జి–20 కూటమికి భారత్ అధ్యక్షత వహించిన సమయంలో యోగాను ఒక ప్రత్యేక కార్యక్రమంగా రూపొందించి అందులో అంతర్భాగం చేసింది. తద్వారా దేశానికి, భారత నాగరికతకు గల గుర్తింపును మరింత పటిష్ఠం చేసింది. మరోవైపు 2014లో ‘ఆయుష్’ పేరిట ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు ద్వారా దేశీయ ఆరోగ్య సంరక్షణ సేవల్లో ఆయుర్వేదం, ఇతర సంప్రదాయ వైద్య విధానాలతో పాటు యోగాను ఏకీకృతం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. భారత్ ఇన్ని విధాలుగా కృషి చేసినందువల్లనే ప్రపంచం 2015 జూన్ 21 నుంచి ‘అంతర్జాతీయ యోగా దినోత్సవం’ నిర్వహించుకోవడం మొదలుపెట్టింది. భారత నాగరికతలో అత్యంత ప్రాచీన, సుసంపన్న సంప్రదాయమైన యోగ, వ్యాధుల నివారణలో శక్తిమంతమైన సాధనంగా ఆవిర్భవించింది. యోగాలోని అంతర్లీన శక్తిని నేడు ప్రపంచం కూడా గ్రహించింది. కాబట్టే, అంతర్జాతీయ సహకార విస్తృతిలో యోగా ఒక ఉమ్మడి పునాదిగా ఆవిర్భవిస్తోంది. యావత్




**కర్మ యోగ స్ఫూర్తితో సాగే యోగ మార్గాన్ని మనం అనుసరిస్తే– వ్యక్తులుగా, సమాజంగా లేదా దేశంగా మన శక్తిసామర్థ్యాలు అనేక రెట్లు పెరుగుతాయి. ఇవాళ మనం ఇదే స్ఫూర్తితో సంకల్పం పూనాలి. మన ఆరోగ్యంతోపాటు మన ఆప్తుల ఆయురారోగ్యాలను రక్షించుకోవడానికి శక్తివంచన లేకుండా మనం కృషి చేస్తాం. అప్రమత్తత గల పౌరులుగా, కుటుంబాలుగా, సమాజంగా ఒక్కతాటిపై నిలిచి ముందడుగు వేస్తాం.**

*– నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి*

మానవాళి వ్యాధి రహిత జీవనానికి భరోసానిస్తోంది. కొన్నేళ్ల కిందట యోగా కేవలం మన ఇళ్లకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు మాత్రమే పరిమితం కాగా, ఇవాళ ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది.




## యోగాపై పరిశోధన

**100** | జిల్లాల్లో నిర్వహించిన బహుళ కేంద్రక దేశవ్యాప్త పరిశోధన అనంతరం మధుమేహ నియంత్రణలో యోగా ఎంతో ప్రభావశీలమైనదిగా తేలింది.

- పరిశోధన పత్రాల ప్రచురణలో సుమారు 6 రెట్లు, వైద్య ప్రయోగాల్లో 11 శాతం పెరుగుదల నమోదైంది. న్యూఢిల్లీలోని ఎయిమ్స్ సమీకృత వైద్య కేంద్రం నుంచి 20కి పైగా పరిశోధన పత్రాలు అంతర్జాతీయ పత్రికలలో ప్రచురితమయ్యాయి.
- యోగా చేసే కేన్సర్ పీడితులలో వ్యాధి పునరావృతమయ్యే ముప్పు సుమారు 15 శాతం తగ్గింది.
- మైగ్రేన్ నియంత్రణలో యోగా ఎంతో ప్రయోజనకరమని 'న్యూరాలజీ' జర్నల్ ప్రచురించిన ఓ పరిశోధన పత్రం పేర్కొంది. యోగాతో మధుమేహం పూర్వదశలోనే పూర్తిగా నయం కావడం విశేషమని 'అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్' ప్రశంసించింది.
- ఆయుష్ పరిశోధన పోర్టల్లో యోగా, ప్రకృతి వైద్యం సంబంధిత 1,426 పరిశోధనాధ్యయనాలు నమోదు కావడం ఒక విశేషం.

### అంతర్జాతీయ యోగా దినోత్సవంలో నానాటికీ పెరుగుతున్న భాగస్వామ్యం

- అంతర్జాతీయ యోగా దినోత్సవం-2016 సందర్భంగా బాలలు-యువతరం స్నేహపూర్వక యోగా ప్రదర్శనలలో పాల్గొన్న వారి సంఖ్య సుమారు 8.5 మిలియన్లు కాగా, 2019 నాటికి దాదాపు 90 మిలియన్లకు చేరింది.
- అంతర్జాతీయ యోగా దినోత్సవం-2022లో సుమారు 221.3 మిలియన్లకు చేరగా, 2023 నాటికి దాదాపు 234.4 మిలియన్లకు పెరిగింది.
- అంతర్జాతీయ యోగా దినోత్సవం-2024లో పాల్గొన్న వారి సంఖ్య 245.3 మిలియన్లకు చేరగా, 2025 నాటికి 260 మిలియన్ల స్థాయిని అధిగమించింది.
- ఈసారి... అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 సందర్భంగా జూన్ 21న పిల్లలు, యువత ఆధారిత స్నేహపూర్వక యోగా ప్రదర్శనలలో పాల్గొనేవారి సంఖ్య 270 మిలియన్లు దాటుతుందని అంచనా.

యోగా ఇప్పుడు ప్రపంచవ్యాప్త వేడుకగా రూపాంతరం చెందింది... ఎందుకంటే- ఇది వ్యక్తి శ్రేయస్సుకు మాత్రమే పరిమితమైనది కాదు... మానవాళి సమష్టి ప్రయోజనమే దీని ఉద్దేశం. ఈ ఏడాది ప్రపంచం ఒకవైపు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించుకోగా, భారత్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం 12 ఏళ్ల ప్రస్థానాన్నీ ఇది ప్రతిబింబించింది.

భారతీయ సంస్కృతిలో 12 ఏళ్ల (పుష్కర) కాలానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఒక తపస్వికి ఇదొక యుగంతో సమానం కాగా, ఇదే వ్యవధిలో మన దేశం వికసిత భారత్ మహా సంకల్ప సాకారం వైపు స్థిరంగా ముందడుగు వేస్తోంది.

## విస్తృతమవుతున్న అంతర్జాతీయ యోగా విపణి

యోగాతో ముడిపడిన అపార అవకాశాలను అందిపుచ్చుకోగల తరుణమిదే. వినూత్న ఆలోచనలతో పెద్ద సంఖ్యలో యువతరం ఈ రంగంలో ప్రవేశిస్తోంది. ఈ పరిణామానికి అద్దం పడుతూ కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ 'యోగా అంకుర సంస్థల పోటీ' (స్టార్టప్ యోగా ఛాలెంజ్)కి శ్రీకారం చుట్టింది. అందరికీ అనేక రకాల అవకాశాల కల్పనే 'ఆయుష్' పరిశ్రమకు అపార బలం. ఉదాహరణకు.. భారత ఆయుష్ రంగంలో సుమారు 40,000 సూక్ష్మ-చిన్న-మధ్య తరహా పరిశ్రమలు (ఎమ్ఎస్ఎమ్ఈ) అనేక రకాల ఉత్పత్తుల తయారీ సహా వివిధ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాయి. ఈ కృషి యావత్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఎంతో చేయూతనిస్తోంది. పన్నెండేళ్ల కిందట దేశీయ ఆయుష్ పరిశ్రమ విలువ సుమారు ₹20,000 కోట్లు కాగా, నేడు దాదాపు ₹1.5 లక్షల కోట్ల స్థాయికి దూసుకెళ్తూ ప్రపంచ విపణిలో మరింత విస్తరణకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం మూలికా ఔషధాలు, సుగంధ ద్రవ్యాల అంతర్జాతీయ మార్కెట్ విలువ 120 బిలియన్ డాలర్లు.. అంటే' ₹10 లక్షల కోట్లుగా ఉంది. ఈ సంప్రదాయ వైద్య రంగం నిరంతర విస్తరణ ద్వారా అందివచ్చే ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవడానికి భారత్ కూడా సదా సిద్ధంగా ఉంది. ఈ వృద్ధితో యువతకు లక్షలాదిగా కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ భారత్తో సంయుక్తంగా గుజరాత్ లోని జామ్ నగర్లో 'గ్లోబల్ సెంటర్ ఫర్ ట్రెడిషనల్ మెడిసిన్'ను ఏర్పాటు చేసింది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సంప్రదాయ వైద్య రంగంలో భారత్ ప్రపంచ అగ్రగామిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది. సంప్రదాయ వైద్యంపై పరిశోధనలకు ప్రోత్సాహం-నిర్వహణలో కీలక మలుపును ఈ కేంద్రం ప్రస్ఫుటం చేస్తుంది. అంతర్జాతీయ స్థాయిలో నిదర్శనాధారిత సంప్రదాయ, అనుబంధ-సమీకృత వైద్య విధానాల్లో విజ్ఞాన కేంద్రంగా ఇది పని చేస్తుంది. దీంతోపాటు 'ఎయిమ్స్' తరహాలో మరో 3 ఆయుర్వేద సంస్థలను ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

## మన యోగా ప్రాధాన్యాన్ని గుర్తిస్తున్న ప్రపంచం

ఆయుర్వేదానికి ప్రజాదరణ పెరుగుదలను సూచించే మరొక రంగం 'యోగా పర్యాటకం'. యోగా అంటే కేవలం శారీరక వ్యాయామానికి పరిమితం కాదు... ఇది వ్యక్తి తనతోతానే కాకుండా ప్రపంచంతో, ప్రకృతితో మమేకమయ్యే భావనాన్వేషణకు మార్గం. జూన్ 21ని అధికారిక అంతర్జాతీయ యోగా దినంగా ప్రకటించడంతో ఈ భావన మరింత సుస్థిరమైంది. ఈ మేరకు 193



## యోగా శిక్షణ, విద్య

- యోగాకు ప్రాచుర్యం, విస్తరణలో శిక్షణకు ప్రత్యేక ప్రాధాన్యముంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగా వంటి సంస్థల ద్వారా ఆయుష్ మంత్రిత్వ శాఖ వివిధ స్థాయులలో ఔత్సాహికులకు శిక్షణనిస్తోంది.
- దేశవ్యాప్తంగా 183 విశ్వవిద్యాలయాల పాఠ్యప్రణాళికలలో ప్రస్తుతం యోగా కోర్సును చేర్చగా, బోధన, శిక్షణ కొనసాగుతోంది.
- యోగా శిక్షణ-ధ్రువీకరణ దిశగా ప్రత్యేక 'యోగా సర్టిఫికేషన్ బోర్డు' (వైసీబీ) ఏర్పాటైంది.
- 'వైసీబీ' వెల్లడించిన వివరాల ప్రకారం- ఇప్పటిదాకా 9,600కు పైగా మూల్యాంకనాలు, 480కి పైగా పరీక్షలు, 14కు పైగా భాషా నిర్దిష్ట పరీక్షలు నిర్వహించారు. మరోవైపు 56కు పైగా దేశాల నుంచి అభ్యర్థుల ప్రతిభపై మూల్యాంకనం నిర్వహించారు.
- అందుబాటులోగల గణాంకాల ప్రకారం - ప్రపంచంలో నేడు దాదాపు 3 కోట్ల మంది యోగా సాధకులు ఉండగా - ఈ దశాబ్దం చివరికల్లా వారి సంఖ్య 3.5 కోట్లకు చేరుతుందని అంచనా.
- యోగా నిపుణులకు ధ్రువీకరణ పత్ర ప్రదానం, యోగా సంస్థల తనిఖీ, యోగా నిపుణుల సర్టిఫికేషన్ సంస్థలకు గుర్తింపు, నియామక ప్రమాణానుగుణంగా యోగా సంస్థలకు గ్రేడింగ్ ఇవ్వడం వంటివి ప్రస్తుతం 'వైసీబీ' కార్యకలాపాలలో భాగంగా ఉన్నాయి.
- విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేకంగా యోగా విభాగాలు కూడా ఏర్పాటయ్యాయి. గడచిన ఐదేళ్లుగా ప్రపంచమంతటా యోగా పాఠశాలలు-స్టూడియోల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 'అమెరికన్ కాలేజ్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్' నిర్దేశిత 10 అగ్రశ్రేణి కోర్సుల జాబితాలో యోగా 7వ స్థానం కైవసం చేసుకుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం కూడా యోగాను స్పర్థాత్మక క్రీడగా గుర్తించింది.








దేశాల ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో 177 దేశాల సహ ప్రాయోజకత్వంతో రికార్డు స్థాయిలో ఏకాభిప్రాయం సాధించిన ప్రతిపాదన ఇది. దీనిపై తుది తీర్మానంలో– “ఆరోగ్యం–శ్రేయస్సు కోసం ఒక సంపూర్ణ విధానాన్ని యోగా వివరిస్తుంది. అంతేకాకుండా మానవాళి జీవనంలోని అన్ని రంగాల నడుమ సామరస్యం సాధిస్తుంది. కాబట్టి, యోగా సాధనతో లభించే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రపంచ జనావళికి విస్తృత సమాచారం అందించడం ఎంతో ఉపయుక్తం” అని సమావేశం వ్యాఖ్యానించింది. తద్వారా భారత్ లో సంపూర్ణ ఆరోగ్య విప్లవ నవ శకం ప్రారంభమైంది. వ్యాధి నివారణకన్నా నిరోధం ప్రధానమన్న సూత్రమే దీనికి ప్రాతిపదిక. యోగాపై భారత్ ప్రతిపాదనను

## అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026

భారత్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 ప్రధాన కార్యక్రమాన్ని జూన్ 21న పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్కతాలో నిర్వహిస్తారు. ‘ఆరోగ్యకర వృద్ధాప్యం కోసం యోగా’ను ఈసారి వేడుకల ఇతివృత్తంగా నిర్ణయించారు. శరీర ఆరోగ్యం, మానసిక శ్రేయస్సు, ఆరోగ్యకర వృద్ధాప్యాన్ని ప్రోత్సహించడంలో యోగా పాత్రను ఇది ప్రస్ఫుటం చేస్తుంది.



ఆమోదిస్తూ ప్రపంచంలోని అత్యధిక దేశాలు సమర్థించిన తొలి తీర్మానంగా ఇది నిలిచిందని ఐక్యరాజ్య సమితి రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అలాగే సమితి చరిత్రలోనే అతి స్వల్ప వ్యవధిలో సర్వసభ్య సమ్మతి పొందిన తీర్మానంగానూ ఇది నిలిచింది.

## ప్రధాన స్రవంతితో యోగా అనుసంధానానికి కృషి

దేశ స్వాతంత్ర్యానంతరం యోగాను ప్రజారోగ్య కార్యక్రమాల జాబితాలో చేర్చేందుకు కృషి చేశారన్నది వాస్తవం. అయితే, ఆ కార్యక్రమాల మందగమనం ఫలితంగా అప్పట్లో యోగాకు సముచిత గుర్తింపు దక్కలేదు. ఆ క్రమంలో తొలి 'కేంద్రీయ యోగా పరిశోధన సంస్థ' (ప్రస్తుత మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా) 1976లో ఏర్పాటైంది. తర్వాత రెండేళ్లకు (1978) 'సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి'ని ఏర్పాటు చేశారు. ఈ రెండింటితోపాటు భారతీయ వైద్య విధానాలు, హోమియోపతి విభాగాన్ని ఏకీకృతం చేస్తూ 2003లో 'ఆయుష్'గా నామకరణం చేశారు. అనంతరం 2014 నవంబరు 9న కేంద్రంలో 'ఆయుష్' మంత్రిత్వ శాఖను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో ఈ రంగానికి ఎనలేని ప్రోత్సాహం లభించింది. మరోవైపు ఐక్యరాజ్య సమితిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగం యోగాకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిపెట్టడంతో ఇదొక ప్రపంచ ప్రజా ఉద్యమంగా ఉద్భవించింది. ఇక కేంద్ర ప్రభుత్వం 2016 ఫిబ్రవరిలో 'నేషనల్ బోర్డ్ ఫర్ యోగా అండ్ నేచురోపతి' పేరిట ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసింది. ఈ చట్రం కింద దేశమంతటా యోగా శిక్షణలో నాణ్యత మెరుగుదల కోసం 'ఎయిమ్స్', 'ఐఐటీ'ల వంటి అత్యున్నత సంస్థల నుంచి నిపుణులను నియమించారు. ఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణలో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో భాగంగా 'ఆయుష్' మంత్రిత్వశాఖ మార్గదర్శకత్వం వహిస్తూ 'సార్వత్రిక యోగా విధానం' జారీ చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ యోగా విస్తరణ, ప్రోత్సాహం లక్ష్యంగా ఆశా కార్యకర్తలకు శిక్షణ ద్వారా యోగాభ్యాసాన్ని ప్రజలకు చేరువ చేసే మాధ్యమంగా ప్రభుత్వం వారి సేవలను వినియోగించుకుంటోంది. ఈ ఏడాది తొలిసారి యోగాభ్యాసానికి స్పర్ధాత్మక క్రీడగా గుర్తింపు సముపార్జించే లక్ష్యంతో ఆయుష్, యువజన వ్యవహారాలు-క్రీడల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఒక కార్యక్రమాన్ని ప్రారంభించాయి. మరోవైపు 'సుదృఢ భారత్ ఉద్యమం' (ఫిట్ ఇండియా మూవ్మెంట్)లో యోగాను కీలక భాగం చేశారు. నేటి పరిస్థితులలో యోగాధ్యయన ఆవశ్యకతను గుర్తించిన జాతీయ విద్యా పరిశోధన-శిక్షణ మండలి (ఎన్‌సీఆర్‌టీ) 1 నుంచి 10వ తరగతి దాకా ఆరోగ్య-వ్యాయామ విద్య పాఠ్యప్రణాళికలో

**“ నేటి ఉరుకులపరుగుల జీవనంలో మనస్సు, శరీరం, మేధ, ఆత్మల సమన్వయంతో వ్యక్తిగత జీవనంలో ప్రశాంతత చేకూర్చే దివ్యౌషధం యోగా. వ్యక్తిని కుటుంబంతో సంధానించడం ద్వారా ఇది సామూహిక ఆనందాన్ని ఇనుమడింపజేస్తుంది. సమాజ అవసరాల దిశగా కుటుంబాల్లో అవగాహన పెంచడం ద్వారా సామాజిక సామరస్యాన్ని ప్రోది చేస్తుంది. తద్వారా దేశాన్ని, సమాజాన్ని ఒక్కటిగా పెనవేసే బంధంగా మారుతుంది. అటువంటి దేశాలు యావత్ ప్రపంచానికీ శాంతిని, సామరస్యాన్ని ప్రసాదిస్తాయి. సౌభ్రాతృత్వ భావన స్ఫూర్తి మానవత్వ వికాసానికి, సంపోషణకు దోహదం చేస్తుంది. సంక్షిప్తంగా చెబితే- వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం, ప్రపంచం సహా సకల మానవాళినీ యోగా ఏకం చేస్తుంది.**

*– నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి*

## యోగా వార్షిక వేడుకగా మిగిలిపోకుండా నిత్య సాధనగా మార్చే 'యోగా 365'

అంతర్జాతీయ యోగా దినోత్సవం 2015లో ప్రారంభమైన నాటి నుంచి వేగంగా విస్తరిస్తూ ప్రపంచంలో అత్యంత భారీ ఆరోగ్య ఉద్యమాలలో ఒకటిగా మారింది. ఈ నేపథ్యంలో దీన్నొక వార్షిక వేడుక స్థాయి నుంచి నిత్య సాధనగా మార్చే లక్ష్యంతో 'యోగ 365' కార్యక్రమానికి భారత్ శ్రీకారం చుట్టింది. వ్యక్తులు, సంస్థలు, సమాజాలను ఏడాది పొడవునా క్రమం తప్పని యోగా సాధనలో నిమగ్నం చేయడం దీని పరమోద్దేశం. అందరికీ ఆరోగ్యం–శ్రేయస్సు దిశగా ప్రజల నిరంతర భాగస్వామ్యం, సంస్థల సహకారం, డిజిటల్ వేదికల వినియోగంతో యోగాభ్యాసాన్ని సార్వజనీన అలవాటుగా మార్చడానికి 'యోగ 365' ద్వారా కృషి కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఉచిత ఆన్లైన్ యోగా కార్యక్రమాల ప్రసారానికి అనుమతించింది. తద్వారా సరళ యోగా ప్రక్రియల నిత్య సాధనపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు.

## సామూహిక భుజంగాసన ప్రదర్శనతో ఆసియా రికార్డు

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు సన్నాహకంగా 55 రోజుల ముందు 'కన్హా శాంతి వనం'లో 6,000 మందికి పైగా సాధకులు సామూహిక భుజంగాసనం ప్రదర్శించారు. ఒక ఆసనాన్ని ఏకకాలంలో అత్యధిక సాధకులు ప్రదర్శించిన కార్యక్రమంగా 'ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్' ఈ ఘనతను నమోదు చేసింది. యోగా ద్వారా సామూహిక భాగస్వామ్య స్ఫూర్తిని ప్రోత్సహించడంతోపాటు సమష్టి శ్రేయస్సు దిశగా కృషిని ఇది ప్రతిబింబిస్తుంది.

## అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఇనుమడిస్తున్న ఆదరణ

**2025**



విశాఖపట్నంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షాన 3 లక్షల మందికి పైగా ప్రజలు ఇందులో పాల్గొనగా, రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు నమోదయ్యాయి: 1. ఒకే ప్రదేశంలో అతిపెద్ద యోగా కార్యక్రమం 2. అత్యంత భారీ స్థాయిలో సామూహిక సూర్య నమస్కారం.

**ఇతివృత్తం: 'ఒకే భూగోళం - మానవాళి ఆరోగ్యం కోసం యోగా'**

**2024**



శ్రీనగర్ లో నిర్వహించిన వేడుకలలో వ్యక్తిగత, సామాజిక శ్రేయస్సును పెంపొందించగల యోగా ద్వంద్వ ప్రయోజన పాత్రను దీని ఇతివృత్తం స్పష్టం చేసింది.

**ఇతివృత్తం: 'వ్యష్టి.. సమష్టి ప్రయోజనం కోసం యోగా'**

**2023**



ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యాన నిర్వహించిన యోగా వేడుకలలో 135 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఇతివృత్తం: 'వసుధైవ కుటుంబకం కోసం యోగా'**

**2022**



కర్ణాటకలోని మైసూరులో వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలతో కలిసి యోగాభ్యాసంలో పాల్గొన్నారు.

**ఇతివృత్తం: 'మానవాళి కోసం యోగా'**

**2021**



ప్రపంచ మహమ్మారి నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆన్లైన్ మాధ్యమం ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ 'ఎంయోగా' (mYoga) యాప్ ను ఆవిష్కరించింది.

**ఇతివృత్తం: 'మానవ శ్రేయస్సు కోసం యోగా'**

**2020**



కోవిడ్–19 ఫలితంగా ప్రపంచ సంక్షోభం వల్ల వేడుకలను బహిరంగంగా కాకుండా ఆన్లైన్ మాధ్యమం ద్వారా నిర్వహించారు.

**ఇతివృత్తం: 'ఇంట్లో సకుటుంబ యోగా'**

**2019**



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాంచీలో ప్రజలతో కలిసి యోగా వేడుకల్లో పాలుపంచుకున్నారు.

**ఇతివృత్తం: 'గుండె ఆరోగ్యం కోసం యోగా'**

**2018**



డెహ్రాడూన్లో 50,000 మంది అభ్యాసకులతో కలిసి ప్రధానమంత్రి యోగాభ్యాసం చేశారు.

**ఇతివృత్తం: 'శాంతి కోసం యోగా'**

**2017**



లక్నోలో నిర్వహించిన ఈ వేడుకలలో 51,000 మంది పాల్గొనగా, వ్యక్తిగత జీవనశైలిలో యోగా ప్రాధాన్యంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు.

**ఇతివృత్తం: 'ఆరోగ్యం కోసం యోగా'**

**2016**



చండీగఢ్ లో 30,000 మందితో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొన్నారు.

**ఇతివృత్తం: 'సుస్థిర లక్ష్యాల సాధన కోసం యోగా'**

**2015**



న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్ లో 35,985 మంది పాల్గొన్న వేడుకలలో రెండు గిన్నిస్ ప్రపంచ రికార్డులు నమోదయ్యాయి.

**ఇతివృత్తం: 'శాంతి-సామరస్యం కోసం యోగా'**

**అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 ఇతివృత్తం: 'ఆరోగ్యకర వృద్ధాప్యం కోసం యోగా'**

యోగాను కూడా చేర్చింది. అంతిమంగా 'ఆయుష్మాన్ భారత్' పథకంలో భాగంగా 12,500 'ఆయుష్' ఆరోగ్య–శ్రేయో కేంద్రాల' నెట్ వర్క్ ద్వారా దేశవ్యాప్తంగా యోగా శిక్షణపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

## అజరామర సంస్కృతీ వారసత్వం

డెహ్రాడూన్ నుంచి డబ్లిన్ వరకు, షాంఘై నుంచి షికాగో దాకా... జకార్తా నుంచి జోహన్నెస్బర్గ్ పర్యంతం యోగా సర్వవ్యాప్తం కావడం భారతీయులకు ఎంతో గర్వకారణం. సమున్నత హిమాలయ





శిఖరాల నడుమ లేదా ఎడారిలోని తీవ్రోష్ణ స్థితిలోనైనా అనుక్షణం, ప్రతి ఒక్కరి జీవితాన్ని యోగా సుసంపన్నం చేయగలదు. అందుకే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ– "విభజన శక్తులు ఆధిపత్యం చలాయించే పరిస్థితి ఏర్పడితే వ్యక్తుల మధ్య, సమాజాల్లోనే కాకుండా దేశాల మధ్య కూడా విచ్ఛిన్న ధోరణులు విజృంభిస్తాయి. సమాజంలో అడ్డుగోడలు మొదలవుతాయి. కుటుంబాలలో అభిప్రాయభేదాలు తలెత్తుతాయి. జీవితంలో ఒత్తిడి మితిమీరి వ్యక్తులు మానసికంగా కుంగిపోతారు. ఈ విచ్ఛిన్నతను నిరోధించగలగడమే కాకుండా ఐక్యతను ప్రోదిచేసే సామర్థ్యం యోగాభ్యాసానికి ఉంది. ప్రజానీకాన్ని ఒక్కతాటిపైకి తేవడంలో యోగాను మించింది మరేదీ లేదు" అని వ్యాఖ్యానించారు.

యోగాభ్యాసానికి ఆదరణ పెరుగుతూ అనేక కొత్త సంస్థలు పుట్టుకొస్తున్నాయి. యోగా శిక్షకులకు డిమాండ్ బాగా పెరిగింది... ఆ మేరకు యువతరం ఇవాళ యోగాను ఒక వృత్తిగా స్వీకరిస్తూ, జీవనోపాధిగా మలచుకునేలా ఈ సంస్థలలో శిక్షణ పొందుతున్నారు. భారతీయ యోగా శిక్షకులకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతోంది. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో కొత్త, సమర్థ ఉపాధి కల్పన విపణిని యోగా సృష్టించింది. ఈ దిశగా కృషిలో భారతీయులకు ప్రపంచవ్యాప్తంగా అత్యంత గౌరవనీయ స్థానం లభిస్తోంది. భారతీయ యోగాను "మానవాళి ప్రచ్ఛన్న సాంస్కృతిక వారసత్వం"గా కొన్నేళ్ల కిందట యునెస్కో అధికారికంగా గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు పాఠశాల–కళాశాలల పాఠ్యప్రణాళికలలో యోగా శిక్షణను చేరుస్తున్నాయి. దేశంలోని అనేక రాష్ట్రాలు కూడా తమ విద్యావిధానంలో యోగాను అంతర్భాగం చేశాయి. తద్వారా శతాబ్దాల నాటి ఈ శాస్త్రంపై భావితరాలకు అవగాహన పెరిగి, వారు దీన్ని ఆచరించడమే కాకుండా దైనందిన జీవితంలో అంతర్భాగంగా మార్చుకోగలరు.

## 'మృదు శక్తి'గా ఆవిర్భవిస్తున్న యోగా

యోగాకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించడంతో "భారత మృదు శక్తి కార్యక్రమం"గా అది సమున్నతంగా నిలిచింది. ఒక దేశ మేధస్సు, సాంస్కృతిక ప్రభావం సహా దాని మృదుశక్తి ఆ సమాజంలోని సృజనాత్మక ఆకాంక్షలను ప్రతిబింబిస్తుంది. ఈ క్రమంలో ప్రభుత్వం కూడా దాని పురోగమనానికి తనవంతు తోడ్పాటునిస్తుంది. విదేశాల్లో 2014కు ముందు కూడా ప్రజానీకం యోగాభ్యాసం చేసేవారు. అయితే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో ఐక్యరాజ్య సమితి జూన్ 21ని "అంతర్జాతీయ

### విస్తరిస్తున్న యోగా విపణి

- భారత యోగా చరిత్ర సుమారు 5,000 ఏళ్ల నాటిది.
- 'అలైడ్ మార్కెట్ రీసెర్చ్' సంస్థ నివేదిక ప్రకారం– 2019లో దీని అంతర్జాతీయ విపణి విలువ 37.5 బిలియన్ డాలర్లు.

2027 నాటికి **$66.4** బిలియన్ల స్థాయికి అంతర్జాతీయ యోగా మార్కెట్.

**$156.11** బిలియన్.. 2021లో అంతర్జాతీయ యోగా మార్కెట్ అంచనా విలువ

**5.8%** మేర అంతర్జాతీయ యోగా పర్యాటక మార్కెట్ 2022–2030 మధ్య వార్షిక వృద్ధిని సాధించగలదని www.grandviewresearch.com అధ్యయన నివేదిక పేర్కొంది.





యోగాభ్యాసకుల చిత్రాలతో లభించిన సింధు-సరస్వతి లోయ నాగరికత నాటి అవశేషాలు, ముద్రలు వంటివి భారత దేశంలో యోగా ప్రాచీన వైభవాన్ని ప్రస్ఫుటం చేస్తున్నాయి.

**విస్తరిస్తున్న యోగా ప్రభావం**

**6** లక్షల మందికి పైగా కార్యకర్తలకు 'మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగా' శిక్షణనిచ్చింది.

**7** లక్షలకు పైగా యోగా వృత్తి నిపుణులు, కార్యకర్తలు 'యోగా సర్టిఫికేషన్ బోర్డు' చట్టం కింద ధ్రువీకరణ పొందారు.

**70** కి పైగా కళాశాలలు విద్యార్థుల కోసం 'బ్యాచిలర్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్' (బీఎన్‌వైఎస్) కోర్సును నిర్వహిస్తున్నాయి.

**5,000** లకు పైగా యోగా శిక్షణ సంస్థలు దేశవ్యాప్తంగా పని చేస్తున్నాయి.

**190+** కి పైగా దేశాల్లో నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

**25** మిలియన్ల కుటుంబాలలో కనీసం ఒకరి వంతున నేడు దేశంలో నిత్యం యోగాభ్యాసం చేస్తున్నారని ఒక జాతీయ సర్వే పేర్కొంది.



యోగాకు ప్రపంచవ్యాప్త ప్రజాదరణ వల్ల అంతర్జాతీయ యోగా మార్కెట్ గడచిన దశాబ్దంలో 5 రెట్లు అధిక వృద్ధిని నమోదు చేసింది.

యోగా దినోత్సవం"గా ప్రకటించాక అదొక ప్రపంచవ్యాప్త వేడుకగా రూపుదాల్చి, నేడు అతిపెద్ద అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవంగా ఉద్భవించింది. భారత్ లో పురుడు పోసుకున్న యోగా, ఎవరైనా ఉచితంగా అభ్యసించగల విద్య. ఈ నేపథ్యంలో తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 2015 జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించుకున్నారు. యోగా విశిష్టతలు, ప్రయోజనాల గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శక్తిమంతంగా ప్రాచుర్యం కల్పించడమే కాకుండా ప్రపంచ వేదికపై తిరుగులేని గుర్తింపును సాధించిపెట్టారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం స్ఫూర్తి విస్తృతం కావడంతో దేశ పురోగమన సంబంధిత ప్రక్రియలు, కార్యకలాపాలన్నిటా మనం చురుగ్గా పాల్గొనే వీలు కలిగింది. ఆరోగ్య పరిరక్షణ అత్యావశ్యకమనే స్పృహను ప్రతి పౌరుడిలోనూ రగిలించింది. మెరుగైన ఆరోగ్య సంరక్షణతో ప్రజల ఆయుర్దాయం పెరగడంతోపాటు దేశ పురోగమన వేగం కూడా ఇనుమడిస్తుందనే వాస్తవాన్ని తోసిపుచ్చే వారు పిడికెడు మంది కూడా ఉండరు. ఇలా పెరిగిన సామర్థ్యమే కర్మ యోగంగా రూపాంతరం చెందింది. ఒక దేశ ఆర్థిక చైతన్యానికి ఆరోగ్యకర జన జీవనశైలి ఎంత కీలకమో ఈ వాస్తవం చాటిచెబుతుంది. సగటు ఆయుర్దాయంలో ఒక్క సంవత్సరం పెరుగుదల కనిపించినా, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 4 శాతం వృద్ధికి అది దోహదం చేస్తుంది.







51,000కు పైగా నియామక పత్రాల పంపిణీ

# ప్రగతి పథాన యువత

## వికసిత భారత్‌కు బలమైన వెన్నుదన్ను

***దేశంలోని యువతరానికి నూతన అవకాశాలను కల్పించడంపై కేంద్ర ప్రభుత్వం నిబద్ధత చాటుకుంటోంది. ఈ క్రమంలో 'రోజ్‌గార్ మేళా' (ఉపాధి కల్పనోత్సవం) ఓ కీలక కార్యక్రమంగా రూపుదాల్చింది. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా 19 'రోజ్‌గార్ మేళా'లను నిర్వహించారు.. తద్వారా 12 లక్షల మందికి పైగా యువ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా గత నెల (మే) 23వ తేదీన దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో ఒకేసారి 19వ రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగం సాధించిన 51,000 మందికి పైగా యువతకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నియామక పత్రాలను పంపిణీ అందజేశారు...***

వికసిత భారత్ స్వప్న సాకారం దిశగా నేడు కొనసాగుతున్న ప్రస్థానంలో దేశ యువతరం కీలక పాత్ర పోషిస్తోంది. ప్రతి భారతీయుడూ ఇవాళ ఓ మహా సంకల్పం – 'వికసిత భారత్–2047'కు రూపుదిద్దే కృషిలో నిమగ్నమయ్యాడు. రోజ్‌గార్ మేళాలో నియామక పత్రాల పంపిణీ సందర్భంగా దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలు కూడా అనేక కార్యక్రమాలు, పథకాలలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. ఈ పెట్టుబడుల ద్వారా యువతకు దేశీయంగానే ఉపాధి అవకాశాలు లభిస్తుండటంతో వారి కలల సాకారానికి మార్గం సుగమం అవుతోంది. ఈ నియామక పత్రాలను అందుకున్నవారు ప్రభుత్వ ఉద్యోగిగా ప్రస్థానం ప్రారంభిస్తున్న నేపథ్యంలో దేశానికి 'వ్యాపార నిర్వహణ సౌలభ్యం' ఎంత కీలకమో వారు సదా గుర్తుంచుకోవాలి. మునుపెన్నడూ ఎరుగని రీతిలో తమ కలలను సాకారం చేసుకోగల, వేగంగా పురోగమించగల అవకాశాలు భారత యువతకు లభిస్తున్నాయి.

అంతేకాదు... బహుళ రంగాల్లో అసంఖ్యాక అవకాశాలు కూడా అందివస్తున్నాయి. ఈ మేరకు తయారీ, సాంకేతికత, అంకుర సంస్థలు, డిజిటల్ సేవలు, రైల్వే, రక్షణ, అంతరిక్షం తదితర అనేక

> "భారత యువతరం ప్రపంచవ్యాప్తంగా ప్రతి రంగంలోనూ తమదైన ముద్ర వేస్తోంది. ఇదే స్ఫూర్తి, శక్తిసామర్థ్యాలు ప్రభుత్వ సేవా రంగంలోనూ ప్రతిబింబించాలి. తమ కర్తవ్య నిర్వహణను దేశ సేవకు ఒక ఉపకరణంగా భావించే యువతరం అవిరళ కృషితోనే 'వికసిత భారత్' రూపుదిద్దుకుంటుంది."
>
> – నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

రంగాలు యువతకు అవకాశాలతో ఆహ్వానం పలుకుతున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ – గరిష్ఠ సంఖ్యలో యువత ఈ నూతన అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా, తమ ప్రతిభను ప్రదర్శించేలా చూడటం ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

### వివిధ మంత్రిత్వ శాఖలు - విభాగాలలో సేవలకు ఉద్యోగుల ఎంపిక

దేశవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన 19వ 'రోజ్‌గార్ మేళా'లో నియామక పత్రాలు స్వీకరించిన అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు-విభాగాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. వీటిలో రైల్వే, హోమ్, ఆరోగ్య-కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖలు సహా ఆర్థిక సేవలు, ఉన్నత విద్య, తదితర విభాగాలు కూడా ఉన్నాయి.

## యువతకు నూతన అవకాశాల కల్పనపై ప్రభుత్వ నిబద్ధత

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా లక్షలాది ఉద్యోగ నియామక పత్రాల పంపిణీ.
- మహిళలు, దివ్యాంగులు, ఆకాంక్షాత్మక జిల్లాల అభ్యర్థులకు ప్రత్యేక ప్రయోజనం.
- యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఆర్ఆర్‌బీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల ద్వారా పరీక్షలతో నియామకాలు.
- సమాన అవకాశాల కల్పనకు ప్రాధాన్యంతో 13 ప్రాంతీయ భాషలలో నియామక పరీక్షల నిర్వహణ.
- 'ఐగాట్-(iGOT) కర్మయోగి' పోర్టల్ ద్వారా 4,800లకు పైగా అత్యుత్తమ నాణ్యత గల ఈ-లెర్నింగ్ కోర్సుల ద్వారా 1.65 కోట్ల మందికి పైగా ఉద్యోగులకు శిక్షణ సౌలభ్యం.
- యువత కలలకు రెక్కలు తొడిగే పారదర్శక, ప్రతిభాధారిత నియామక ప్రక్రియ.

*ప్రధానమంత్రి కార్యక్రమాన్ని వీక్షించడం కోసం 'క్యూఆర్' కోడ్ను స్కాన్ చేయండి*

తదనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమానుగుణ విద్య, భవిష్యత్తు సాంకేతికతలపై ప్రభుత్వం నిరంతరం దృష్టి సారిస్తోంది. తద్వారా పారిశ్రామిక శిక్షణ సంస్థల (ఐటీఐ) ఆధునికీకరణ, జాతీయ నైపుణ్య శిక్షణ సంస్థల బలోపేతం సహా 'పీఎం సేతు' వంటి కార్యక్రమాలు చురుగ్గా అమలవుతున్నాయి.

### దేశంలో ఇనుమడిస్తున్న ప్రజాకాంక్షలు

దేశంలో నేడు ప్రజల ఆకాంక్షలు వేగంగా ఇనుమడిస్తుండటం అభివృద్ధికి ఓ సానుకూల సంకేతం. ఈ నేపథ్యంలో నియామక పత్రాల పంపిణీ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ- సహ పౌరుల ఆశలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవడమే కాకుండా, వాటిని నెరవేర్చే దిశగా తగిన వేగం, చిత్తశుద్ధితో కృషి చేయాలని పేర్కొన్నారు. కాలక్రమంలో ప్రభుత్వ సేవల్లోకి ప్రవేశించే యువ ఆశావహుల పాత్ర అత్యంత కీలకంగా మారుతోంది. కాబట్టి, నిరంతరం అభ్యాసం ద్వారా కొత్త సాంకేతికతలు, వినూత్న వ్యవస్థలు, మారుతున్న అవసరాలకు తగినట్లు తమనుతాము నిరంతరం తీర్చిదిద్దుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువతకు పిలుపునిచ్చారు. ఈ ప్రయత్నంలో 'ఐగాట్-కర్మయోగి' పోర్టల్ వారికెంతో తోడ్పడుతుందని చెప్పారు. ముఖ్యంగా బాధ్యతలపై అవగాహన కల్పనలో 'కర్మయోగి ప్రారంభ్' వంటి మాడ్యూళ్లు ఎంతో సహాయపడతాయని తెలిపారు. ఈ వనరులను వీలైనంత ఎక్కువగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రోజ్‌గార్ మేళా ద్వారా యువతకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పన

| కార్యక్రమం తేదీ | జారీ చేసిన నియామక పత్రాల సంఖ్య |
|---|---|
| అక్టోబరు 22, 2022 | 75,000 + |
| నవంబరు 22, 2022 | 71,000+ |
| జనవరి 20, 2023 | 71,000 + |
| ఏప్రిల్ 13, 2023 | 71,000 + |
| మే 16, 2023 | 70,000 + |
| జూన్ 13, 2023 | 70,000 + |
| జూలై 22, 2023 | 70,000 + |
| ఆగస్టు 28, 2023 | 51,000 + |
| సెప్టెంబరు 26, 2023 | 51,000 + |
| అక్టోబరు 28, 2023 | 51,000 + |
| నవంబరు 30, 2023 | 51,000 + |
| ఫిబ్రవరి 12, 2024 | 1,00,000 + |
| అక్టోబరు 29, 2024 | 51,000 + |
| డిసెంబరు 23, 2024 | 71,000 + |
| ఏప్రిల్ 26, 2025 | 51,000 + |
| జూలై 12, 2025 | 51,000 + |
| అక్టోబరు 24, 2025 | 51,000 + |
| జనవరి 24, 2026 | 61,000 + |
| మే 23, 2026 | 51,000 + |

**కేంద్ర మంత్రిమండలి నిర్ణయాలు**

# ఆహార భద్రత

## కాలుష్య రహిత రవాణాకు నవోత్తేజం

**దేశంలో పేదల సంక్షేమ పథకాలను మరింత పారదర్శకంగా, సమర్థంగా అమలు చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటోంది. ఇందులో భాగంగా 'సార్థక్-పీడీఎస్' పథకం రెండో దశకు ₹25,530 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనను కేంద్ర మంత్రిమండలి ఆమోదించింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత లబ్ధిదారుల రిజిస్ట్రీ, జీపీఎస్ ట్రాకింగ్, క్యూఆర్ కోడ్ ట్యాగింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థల ద్వారా రాయితీ ఆహార ధాన్యాలు, ఇతర సంక్షేమ సేవలు సహా 100 శాతం ప్రయోజనాలు నేరుగా పేద లబ్ధిదారులకు చేరుతాయి. అంతేకాకుండా మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమాల్లో భాగంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో పాత ట్రక్కులు, బస్సుల బదులు కొత్త కాలుష్య రహిత వాహనాలను ప్రవేశపెట్టే పథకం సహా అనేక ఇతర ప్రతిపాదనలకూ ఆమోదముద్ర వేసింది.**




మంత్రిమండలి నిర్ణయాలపై విలేకరుల సమావేశం వీక్షించడం కోసం 'క్యూఆర్' కోడ్ను స్కాన్ చేయండి

**నిర్ణయం: ఢిల్లీ-ఎన్.సీ.ఆర్ పాత ట్రక్కులు, బస్సుల స్థానంలో బీఎస్- VI ప్రమాణానుగుణ లేదా విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టే పథకానికి ఆమోదం.**

**ప్రభావం:** ఈ పథకం ద్వారా ఢిల్లీ-ఎన్.సీ.ఆర్ ప్రాంతంలో సుమారు 1,91,000 ట్రక్కులు, 16,329 బస్సులు ద్వారా ప్రయోజనం కలుగుతుంది. ఈ ప్రాంతంలో వాయు కాలుష్యం తగ్గింపు దిశగా ఈ కార్యక్రమం గణనీయంగా దోహదం చేస్తుందని అంచనా. తద్వారా పర్యావరణ హిత రవాణా వ్యవస్థకు ప్రోత్సాహం లభించడమే కాకుండా వాయు నాణ్యత మెరుగు పడుతుంది.

**నిర్ణయం: హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో భాగంగా ఒడిషాలో రామేశ్వర్ నుంచి పారాదీప్ దాకా విస్తరించిన కొత్త తీరప్రాంత రహదారి విభాగం నిర్మాణ ప్రాజెక్టుకు ఆమోదం (ఇది 160.18 కిలోమీటర్ల ప్రధాన తీరప్రాంత జాతీయ రహదారి కాగా, దీన్ని రెండు ప్యాకేజీలుగా నిర్మిస్తారు).**

**ప్రభావం:** ఈ విభాగం మొత్తం పొడవు 160.18 కిలోమీటర్లు కాగా, దీనికి ₹8,300.79 కోట్లు వ్యయం కాగలదని అంచనా. 'పీఎం గతిశక్తి'కి అనుగుణంగా నిర్మించే ఈ ప్రాజెక్టులో భాగంగా 9 ఆర్థిక కూడళ్లు, 5 రవాణా కూడళ్లు అనుసంధానమవుతాయి. జాతీయ రవాణా రంగ పనితీరు సూచీ (ఎల్పీఐ)పై ఇది సానుకూల ప్రభావం చూపగలదని భావిస్తున్నారు.

- ఈ ప్రాజెక్టు పూర్తయితే రామేశ్వర్-పారాదీప్ మధ్య ప్రయాణ సమయం 2:30 గంటల మేర తగ్గుతుందని అంచనా. అంతేగాక ప్రయాణ, సరకు రవాణా రెండింటికీ సురక్షిత, వేగపూరిత, నిరంతరాయ అనుసంధానం కలుగుతుంది. మరోవైపు ఇంధన వినియోగం, కర్బన ఉద్గారాలు, వాహన నిర్వహణ వ్యయం తగ్గుతాయి.

**నిర్ణయం: బీహార్ లోని 'ఎన్‌హెచ్-31, ఎన్‌హెచ్-231'ల పరిధిలోని ఖగారియా-పూర్ణియా విభాగాన్ని (143.529 కి.మీ.) బీఓటీ (టోల్) పద్ధతిలో ₹3,936.05 కోట్ల వ్యయంతో 4 వరుసల ప్రమాణాలకు తగినట్లు ఉన్నతీకరించే ప్రతిపాదనకు ఆమోదం**

**ప్రభావం:** ఇది ఖగారియా, భాగల్పూర్, కటీహార్, పూర్ణియా జిల్లాల పట్టణ ప్రాంతాల పరిధిలో ప్రస్తుత తీవ్ర కోణీయ లోపాలు, పదునైన మలుపులు, రద్దీ సమస్యలను పరిష్కరిస్తుంది. ఈ ప్రాజెక్ట్ లో భాగంగా పూర్ణియా నగర అవసరాల కోసం సుమారు 7 కి.మీ. పొడవైన విస్తృత కొత్త బైపాస్ రహదారిని కూడా నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టుతో సగటు ప్రయాణ వేగం పెరగడమేగాక సుమారు 2 గంటల దాకా సమయం ఆదా అవుతుంది. అలాగే

**నిర్ణయం: రేషన్ సరకుల రవాణా-నిర్వహణ, ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) యాంత్రీకీకరణ సహాయ కార్యక్రమాన్ని (సార్థక్-పీడీఎస్) ఒక సమగ్ర పథకంగా కొనసాగించే ప్రతిపాదనకు ఆమోదం.**

**ప్రభావం:**

- రేషన్ రవాణా సహాయ పథకం, స్మార్ట్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పీడీఎస్) పథకాలను విలీనం చేస్తూ దానికి 'సార్థక్-పీడీఎస్'గా నామకరణం చేశారు.
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆహార ధాన్యాల అంతర్గత రవాణా-నిర్వహణ వ్యయం భర్తీకి కేంద్ర సహాయంపై నిబంధనల సవరణ.
- రేషన్ దుకాణాల డీలర్లకు ప్రస్తుతం లభించే కేంద్ర ఆర్థిక సహాయంతోపాటు మార్జిన్ తోడ్పాటు కూడా కొనసాగుతుంది.
- మరింత సమర్థ, పారదర్శక, సాంకేతికత ఆధారిత పంపిణీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి.
- జాతీయ ఆహార భద్రత చట్టం అమలు బలోపేతం కోసం సమగ్ర, పరస్పర సంధాన సామర్థ్యం గల పీడీఎస్ విధానం రూపకల్పన.
- పీడీఎస్ కార్యకలాపాల ఆధునికీకరణ కోసం 'ఏఐ, ఎంఎల్, ఎన్ఎల్పీ, బ్లాక్ చెయిన్' వంటి ఆధునిక సాంకేతికతల వినియోగం.
- ప్రత్యక్ష పర్యవేక్షణ, ఏఐ ఆధారిత ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు రూపకల్పన చేస్తారు.



**₹25,530**

**కోట్ల మేర 16వ ఆర్థిక సంఘం కాలంలో కేంద్ర ప్రభుత్వ వ్యయానికి ఆమోదం.**

**81.35**

**కోట్ల మంది లబ్ధిదారులకు జాతీయ ఆహార భద్రత చట్టంలో భాగంగా ప్రయోజనం. తద్వారా దేశ ఆహార భద్రత చట్టం బలోపేతం.**

*ఈ పథకం మార్చి 31, 2031 వరకు అమలులో ఉంటుంది.*

- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఆధార్ అనుసంధానం, ఈ-పీఓఎస్ ఆటోమేషన్, కంప్యూటరీకరించిన సరఫరా గొలుసు నిర్వహణ వ్యవస్థలను విస్తరించనున్నారు.

ఇది రహదారి భద్రత, ఇంధన సామర్థ్యం, వాహన నిర్వహణ వ్యయాల్లో మెరుగుదలకు తోడ్పడుతుంది.

**నిర్ణయం: జాతీయ, అంతర్జాతీయ విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరలలో స్థిరత్వ పరిరక్షణ దిశగా షెడ్యూల్డ్ భారతీయ విమానయాన సంస్థలకు తోడ్పాటుగా చమురు విక్రయ కంపెనీ (ఓఎంసీ)లకు ₹10,000 కోట్ల వరకు ఒకే దఫా బడ్జెట్ మద్దతు ప్రతిపాదనకు ఆమోదం.**

**ప్రభావం:** 'ఓఎంసీ'లకు వడ్డీ రహిత రుణం రూపేణా బడ్జెట్ మద్దతు లభిస్తుంది. పెట్రోలియం-సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నుంచి నిధుల కేటాయింపు అభ్యర్థన (డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్) ప్రాతిపదికన ఈ నిధులను ప్రభుత్వం సమకూరుస్తుంది. పశ్చిమాసియా సంక్షోభం వల్ల ఇంధన ధరల అస్థిరత అసాధారణ స్థాయిలో కొనసాగుతున్నందున ఏటీఎఫ్ ధరల స్థిరత్వం దిశగా 'ఓఎంసీ'లకు ఈ సహాయం అందుతోంది.

**నిర్ణయం: తెలంగాణ పరిధిలోని జాతీయ రహదారి (ఎన్హెచ్)-63లో ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల విభాగాన్ని 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' (హెచ్ఏఎం) కింద, జాతీయ రహదారి (ఎన్హెచ్)-563లో జగిత్యాల-కరీంనగర్ మార్గాన్ని 'బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్ఫర్ (టోల్)' విధానంలో భాగంగా 4 వరుసల రహదారి ప్రమాణాలకు అనుగుణంగా విస్తరించే ప్రతిపాదనకు ఆమోదం.**

**ప్రభావం:** ఈ మార్గాల పొడవు 190.76 కి.మీ. కాగా, ప్రాజెక్టు అంచనా వ్యయం ₹7,500 కోట్లు. ఇది పూర్తయ్యాక ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా సురక్షిత, సత్వర, నిరంతరాయ రవాణా సౌకర్యం ఏర్పడుతుంది. మరోవైపు ఇంధన వినియోగం, కర్బన ఉద్గారాలు, వాహన నిర్వహణ వ్యయం గణనీయంగా తగ్గుతాయి.

**నిర్ణయం: మధ్యప్రదేశ్లో 'ఎన్హెచ్-347బి'లో 125 కి.మీ. పొడవైన హివార్ ఖేడీ-రోష్ని-ఆశాపుర్-రుధి మార్గాన్ని రెండు వరుసల రహదారి ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నతీకరణతోపాటు సుమారు 109 కిలోమీటర్ల దేశ్గావ్-జుల్వానియా మార్గాన్ని 'హెచ్ఏఎం' లో భాగంగా 4 వరుసల రహదారి ప్రమాణాలతో విస్తరించేందుకు ఆమోదం.**

**ప్రభావం:** ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం ₹4,415.60 కోట్లు. ఇది పూర్తయితే సగటు ప్రయాణ వేగం పెరగడంతోపాటు రవాణా అనుసంధానం మెరుగవుతుంది. రహదారి భద్రత, ఇంధన సామర్థ్యం, వాహన నిర్వహణ వ్యయం తదితరాల్లో సానుకూల మార్పులు వస్తాయి. మధ్యప్రదేశ్ లో కీలకమైన సామాజిక-ఆర్థిక, రవాణా కూడళ్లను ఈ ప్రాజెక్టు సమర్థంగా అనుసంధానిస్తుంది.




పద్మ పురస్కారాలు - 2026

# జాతీయ ధీరులకు సగౌరవ సత్కారం

***దేశంలోని విశిష్ట ప్రతిభ, అసాధారణ సేవాభావం, అకుంఠిత ధైర్యసాహసాల ప్రకాశంతో రాష్ట్రపతి భవన్‌లోని 'గణతంత్ర మండపం' మరోసారి వెలుగులు విరజిమ్మింది. ఎందుకంటే- మే 25న 'సివిల్ ఇన్వెస్టిచర్ సెరిమొనీ-I' (పౌర పురస్కార ప్రదానోత్సవం)లో 2026కు గాను ఎంపికైన 131 మందిలో 66 మంది జాతీయ ధీరులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిష్ఠాత్మక పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలతో సత్కరించారు.***

ఈ కార్యక్రమం తొలి దశలో 2 పద్మ విభూషణ్, 6 పద్మ భూషణ్, 58 పద్మశ్రీ పురస్కారాలను రాష్ట్రపతి ప్రదానం చేశారు. ఇది అవార్డుల ప్రదానానికి పరిమితమైన కార్యక్రమం కాదు... తమ అవిశ్రాంత కృషితో దేశాన్ని ప్రభావితం చేసిన అట్టడుగు స్థాయి ధీరుల అంకితభావం, విజయాలను సముచిత రీతిన సత్కరించే సందర్భం. ఈ మేరకు కళలు, సాహిత్యం, సామాజిక సేవ, విజ్ఞానశాస్త్రం, పారిశ్రామిక రంగం తదితరాల్లో విశిష్ట సేవల ద్వారా దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన భరతమాత పుత్రులు/పుత్రికలను రాష్ట్రపతి భవన్లో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సత్కరించారు. దేశ అత్యున్నత పౌర పురస్కారాల జాబితాలో స్థానం సముపార్జించిన అసాధారణ వ్యక్తుల ప్రస్థానానికి ఈ పురస్కారం ఓ సముచిత గుర్తింపు. కాగా, 2026కు గాను పద్మ పురస్కారానికి ఎంపికైన 131 మంది పేర్లను కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 25న ప్రకటించింది.




## పద్మ విభూషణ్



### ధర్మేంద్ర సింగ్ డియోల్ (మరణానంతరం)

*భారతీయ సినిమా నట దిగ్గజం, పార్లమెంట్ మాజీ సభ్యుడు కూడా అయిన ధర్మేంద్ర హిందీ చిత్ర పరిశ్రమ చరిత్రలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా, విజయవంతమైన కళాకారులలో ఒకరుగా ఎంతో గుర్తింపు పొందారు. పంజాబ్లోని నస్రాలీలో 1939 డిసెంబరు 8న జన్మించిన ఆయన, బాలీవుడ్ 'హీ-మ్యాన్'గా ప్రసిద్ధికెక్కారు. ఆరు దశాబ్దాలకు పైగా అద్భుత నట జీవితాన్ని ఆస్వాదిస్తూ 300కు పైగా చిత్రాల్లో నటించారు. అంతేకాదు... హిందీ చిత్రసీమలో అత్యధిక హిట్ చిత్రాల్లో నటించిన రికార్డు ఆయన సొంతం. కళారంగంలో ఆజీవన అంకితభావానికి గాను అనేక ప్రతిష్ఠాత్మక గౌరవ, పురస్కారాలు ఆయనను వరించాయి. బాలీవుడ్కు విశిష్ట సేవలందించినందుకు గుర్తింపుగా 1997లో 'ఫిల్మ్ఫేర్' జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. అటుపైన 2012లో దేశంలో మూడో అత్యున్నత పౌర పురస్కారం పద్మభూషణ్తో ప్రభుత్వం ఆయనను సత్కరించింది. తన సినీ రంగ విజయాలకు అతీతంగా ధర్మేంద్ర 2004 నుంచి 2009 వరకు పార్లమెంటు లోక్ సభ సభ్యుడుగా రాజస్థాన్ లోని బీకానేర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు.*




## పద్మ శ్రీ

- విశ్వబంధు (మరణానంతరం)
- భరత్ సింగ్ భారతి
- తాగా రామ్ భిల్
- హర్మన్ప్రీత్ కౌర్ భుల్లర్
- రతీలాల్ మోహన్ లాల్ బొరిసాగర్
- కుమార్ బోస్
- జనార్దన్ బాపూరావ్ బోతే
- స్వామి బ్రహ్మదేవ్
- ప్రసేన్ జిత్ చటర్జీ
- దేవకి అమ్మాజీ
- డాక్టర్ రామచంద్ర గాడ్బోలే
- సునీతా గాడ్బోలే
- టెచీ గుబిన్
- డాక్టర్ హెచ్.వి.హండే
- గఫారుద్దీన్ మేవాటి జోగి
- మీర్ హాజీ కసమ్
- రఘువీర్ ఖేద్కర్
- ఆర్.కృష్ణన్ కిట్నా (మరణానంతరం)
- ప్రొఫెసర్ డాక్టర్ లార్స్-క్రిస్టియన్ కాచ్
- ప్రొఫెసర్ మామిడాల జగదీష్ కుమార్
- ప్రవీణ్ కుమార్
- కె.విజయ్ కుమార్
- శ్రీరంగ్ దేవ్బా లాడ్
- అంకెగౌడ ఎమ్
- ప్రొఫెసర్ (డాక్టర్) సరోజ్ మండల్
- ప్రొఫెసర్ బుద్ధ రశ్మి మణి
- నీలేష్ వినోద్ చంద్ర మాండ్లేవాలా
- డాక్టర్ మహేంద్ర కుమార్ మిశ్రా
- తృప్తి ముఖర్జీ




**పద్మ విభూషణ్**



## డాక్టర్ (శ్రీమతి) ఎన్.రాజమ్

అత్యుత్తమ, అత్యంత విశిష్ట సంగీత కళాకారిణులలో రాజమ్ ఒకరు. ఆమె వేలి కొసలు తాకితే చాలు... వయొలిన్ వాద్యం రాగరంజిత వాతావరణాన్ని సృష్టించి, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తుంది. వయొలిన్ పై గాత్ర శైలిని ప్రదర్శించే 'గాయకీ అంగ్' పద్ధతిని పరిచయం చేయడం ద్వారా శాస్త్రీయ సంగీతంలో విప్లవాత్మక మార్పులకు ఆమె శ్రీకారం చుట్టారు. ఈ ప్రక్రియ ఆమెకు 'సింగింగ్ వయొలిన్'గా ప్రపంచ ప్రతిష్ఠను సముపార్జించింది. డాక్టర్ రాజం ఎర్నాకుళంలోని సంగీత సంప్రదాయ కుటుంబంలో 1939 మార్చి 16న జన్మించారు. తన తండ్రి విద్వాన్ ఎ.నారాయణ అయ్యర్ తొలి గురువుగా సంగీత సాధనకు పునాది వేసుకున్నారు. సంగీత విద్యాంసురాలుగా విశిష్ట వృత్తితోపాటు దాదాపు నాలుగు దశాబ్దాలు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రదర్శన కళల విభాగం ప్రొఫెసర్ గా విశిష్ట సేవలందించారు. అటుపైన ఆ విభాగాధిపతిగా ఎదగడంతోపాటు ఫ్యాకల్టీ డీన్ గానూ పని చేశారు. డాక్టర్ రాజమ్ ప్రపంచమంతటా విస్తృతంగా సంగీత ప్రదర్శనలిచ్చారు. అమెరికా, కెనడా, రష్యా, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సహా ఐరోపా ఖండంలోని దేశాలన్నిటా సంగీతాభిమానులను గానామృతంతో అలరించారు. డాక్టర్ రాజమ్ అనేక ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. హిందుస్థానీ సంగీత రంగానికి ఆమె అందించిన అసాధారణ సేవలకు గాను 1984లో పద్మశ్రీ, 1990లో సంగీత నాటక అకాడమీ అవార్డు, 2004లో పద్మభూషణ్ సత్కారం పొందారు.




**పద్మ భూషణ్**



## డాక్టర్ ఆర్.గణేష్

డాక్టర్ ఆర్.గణేష్ అవధాన కళలో ఆరితేరినవారు. ఇది భారత్కు మాత్రమే ప్రత్యేకమైన శాస్త్రీయ కళారూపం. ఇందులో కలం, కాగితం తదితరాలతో పని లేకుండా ఆశువుగా పద్యాలల్లుతూ వివిధ రకాల కవితాత్మక సవాళ్లను పరిష్కరిస్తారు. అవధాని సృజనాత్మకత, పాండితీ ప్రకర్షకు అత్యున్నత స్థాయిలో పరీక్ష పెట్టే కళా రూపమిది. అవధాని బహుముఖ ప్రజ్ఞను, విభిన్న కోణాల్లో మేధా మథన సామర్థ్యాన్ని ఇది అన్వేషిస్తుంది. కాగా, కన్నడ భాషలో ఈ కళారూపాన్ని పునరుద్ధరించిన ఘనత డాక్టర్ ఆర్. గణేష్ శతావధానికే దక్కింది. ఇప్పటిదాకా ఆయన ప్రధానంగా కన్నడ, సంస్కృత భాషలలో 1,300కు పైగా అష్టావధానాలు, 5 శతావధానాలు చేశారు. ఈ కళ సంబంధిత అన్ని రూపాలలో ప్రదర్శనల ద్వారా అనేక వినూత్నాంశాలను పరిచయం చేస్తూ, ప్రాచీన కళారూపాన్ని సజీవంగా ఉంచడమే కాకుండా నవ తరం అవధానులకు స్ఫూర్తినిచ్చారు. కర్ణాటకలోని కోలార్లో 1962 డిసెంబరు 4న జన్మించిన ఆయన మెకానికల్ ఇంజనీరింగ్ పట్టాతోపాటు మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జీ, సంస్కృతంలో మాస్టర్ డిగ్రీలు సహా కన్నడలో డి.లిట్. పట్టా సాధించారు. కవిత్వం, ఛందస్సు, సాహిత్యం, తత్త్వశాస్త్రం, శాస్త్రీయ కళలలోనూ నైపుణ్యం సొంతం చేసుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ ఆర్. గణేష్. భారతీయ సాంస్కృతిక వారసత్వంపై ఆయనకు సునిశిత అవగాహన ఉంది. కన్నడ, సంస్కృత, ప్రాకృత, పాళీ, తెలుగు, తమిళం, హిందీ, గ్రీక్, లాటిన్, ఇటాలియన్ భాషా పాండిత్యంగల విశిష్ట వ్యక్తిగానూ ఆయన వాసికెక్కారు.



## పద్మ భూషణ్



### భగత్ సింగ్ కోష్యారీ

ఉత్తరాఖండ్ రాష్ట్ర వాసులు 'భగత్ దా' అని ఆప్యాయంగా పిలుచుకునే భగత్ సింగ్ కోష్యారీ విశిష్ట సామాజిక కార్యకర్త, విద్యావేత్త, పాత్రికేయుడు, జాతీయవాద నేత. సమాజంలోని పేద-అణగారిన వర్గాల అభ్యున్నతికి, ప్రజా సేవకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. రాష్ట్రంలోని బాగేశ్వర్ జిల్లా పాలంధురా గ్రామంలో 1942 జూన్ 17న కోష్యారీ జన్మించారు. అటుపైన 22 ఏళ్ల ప్రాయంలోనే 1964లో ఆంగ్ల సాహిత్యంలో మాస్టర్స్ పట్టా పొందారు. అధ్యాపకుడిగా వృత్తి జీవితానికి శ్రీకారం చుట్టిన ఆయన, అనంతర కాలంలో విద్యా, సామాజిక సేవా రంగాలకు పూర్తిగా అంకితమయ్యారు. ఉత్తరప్రదేశ్ శాసనమండలికి 1997లో ఎన్నికైన కోష్యారీ, ఉత్తరాఖండ్ ఆవిర్భావం తర్వాత తొలి ప్రభుత్వంలో కేబినెట్ మంత్రిగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అలాగే పార్లమెంటులో ఉభయసభల సభ్యుడుగా, మహారాష్ట్ర గవర్నర్గా, గోవా గవర్నర్గా (అదనపు బాధ్యత) ఆయన తన సేవలందించారు.



## పద్మ శ్రీ

- హరిమాధవ్ ముఖోపాధ్యాయ (మరణానంతరం)
- డాక్టర్ ఎ.ఇ.ముత్తునాయగం
- సత్యనారాయణ నందలాల్ నువాల్
- కె.పళనివేల్
- ధార్మిక్ లాల్ చునీలాల్ పాండ్య
- కైలాష్ చంద్ర పంత్
- గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం)
- ప్రొఫెసర్ (డాక్టర్) రాజేంద్ర ప్రసాద్
- డాక్టర్ గుడూరు వెంకట రావు
- దీపికా రెడ్డి
- డాక్టర్ పాలకొండ విజయానంద్ రెడ్డి
- హరిచరణ్ సైకియా
- ప్రొఫెసర్ వేంపటి కుటుంబ శాస్త్రి
- ప్రొఫెసర్ షఫీ షౌక్
- బల్దేవ్ సింగ్
- యుమ్నం జాత్రా సింగ్ (మరణానంతరం)
- డాక్టర్ అశోక్ కుమార్ సింగ్
- శివశంకరి
- డాక్టర్ ఆర్.శ్రీధర్
- ప్రొఫెసర్ శ్యామ్ సుందర్
- డాక్టర్ ఎస్.జి.సుశీలమ్మ
- ఎస్. స్వామినాథన్
- డాక్టర్ కేవల్ కిషన్ థక్రాల్
- డాక్టర్ గోపాల్ జీ త్రివేది (మరణానంతరం)
- అరవింద్ వైద్య
- ప్రొఫెసర్ జుజర్ వాసి
- డాక్టర్ నారాయణ్ వ్యాస్
- హాలీ వార్
- ప్రొఫెసర్ గంభీర్ సింగ్ యోంజోన్



## పద్మ భూషణ్





### ఉదయ్ సురేష్ కుమార్ కోటక్

భారత ప్రముఖ బ్యాంకర్లలో ఒకరు... ఆర్థిక సేవల రంగంలో అగ్రగామి అయిన ఉదయ్ సురేష్ కుమార్ కోటక్ 1959 మార్చి 15న జన్మించారు. దేశంలోని అత్యుత్తమ ప్రైవేట్ బ్యాంకులలో ఒకదాన్ని స్థాపించడంలో కీలక పాత్ర పోషించిన ఆయన, 1985లో 'కోటక్ మహీంద్రా ఫైనాన్స్ లిమిటెడ్'కు శ్రీకారం చుట్టారు. అనంతర కాలంలో ఈ సంస్థ పెట్టుబడి బ్యాంకింగ్, స్టాక్ బ్రోకింగ్, బీమా, కార్ ఫైనాన్స్, మ్యూచువల్ ఫండ్స్ వంటి ఇతరత్రా ఆర్థిక సేవల రంగాల్లోకి తన కార్యకలాపాలను విస్తరించించింది. అటుపైన 2003 మార్చిలో 'కోటక్ మహీంద్రా బ్యాంక్'గా రూపాంతరీకరణతో భారత రిజర్వు బ్యాంకు నుంచి బ్యాంకింగ్ లైసెన్స్ పొందిన తొలి దేశీయ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్బీఎఫ్సీ)గా నిలిచింది. ఈ బ్యాంకు విస్తరణకు నాయకత్వం వహించిన ఉదయ్ సురేష్ కుమార్ కోటక్, 2014లో 'ఐఎన్జీ వైశ్యా బ్యాంక్'ను కైవసం చేసుకోవడం ద్వారా తమ బ్యాంకును మరింత పటిష్ట స్థాయికి చేర్చారు. భారత బ్యాంకింగ్, ఆర్థిక రంగాల వృద్ధితోపాటు పురోగమనానికి గణనీయ సేవలందించారు. అనేక కీలక సంస్థలకు నాయకత్వం వహిస్తున్న ఆయన 'ఇండో-యూకే ఫైనాన్షియల్ పార్టనర్ షిప్' కో-చైర్మన్గా, 'గవర్నమెంట్ ఆఫ్ సింగపూర్ ఇన్వెస్ట్మెంట్ కార్పొరేషన్' అంతర్జాతీయ సలహా మండలి సభ్యుడుగానూ వ్యవహరిస్తున్నారు. మరోవైపు 2023 డిసెంబరు వరకూ 'మోనిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్' అంతర్జాతీయ సలహా బృందంలో సభ్యుడుగా ఉన్నారు. భారత్లో 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ' (సీఐఐ) అధ్యక్షుడుగానూ సేవలందించారు.

### డాక్టర్ కళ్లిపట్టి రామసామి పళనిస్వామి

డాక్టర్ కళ్లిపట్టి రామసామి పళనిస్వామి నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవజ్ఞుడైన జీర్ణకోశ వ్యాధుల నిపుణుడు (గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్). తమిళనాడులోని కళ్లిపట్టి గ్రామంలో 1949 మార్చి 15న ఒక వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన, 1972లో మైసూర్ విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్ పట్టా పొందారు. ఆ తర్వాత 1981లో మద్రాస్ మెడికల్ కాలేజీ నుంచి డీఎం (గ్యాస్ట్రోఎంటరాలజీ) డిగ్రీ సంపాదించారు. డాక్టర్ పళనిస్వామి 1986లోనే స్టాన్లీ వైద్య కళాశాలలో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తర చెన్నైలోని నిరుపేదల సేవే లక్ష్యంగా 2000 సంవత్సరం దాకా ఆ విభాగాధిపతిగా, ప్రొఫెసర్ గా బాధ్యతలు నిర్వర్తించారు. సమాజంలోని పేద-అణగారిన వర్గాల సేవలో అంకితభావంతో వ్యవహరించారు. చెన్నైలోని రామకృష్ణ మఠం ఆస్పత్రిలో మూడు దశాబ్దాలకు పైగా స్వచ్ఛంద సేవలందించారు. తన స్వగ్రామమైన కళ్లిపట్టిలో పలుమార్లు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. అంతేకాకుండా గ్రామంలో వంతెన, విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణం సహా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కొత్త భవనం ఏర్పాటు, భూగర్భజల పునరుద్ధరణకు చెక్ డ్యామ్ల నిర్మాణం వంటి అనేక మౌలిక సదుపాయాల కల్పనకు అవిరళ కృషి చేశారు. వైద్య రంగంలో ఆయన సేవలకు గుర్తింపుగా 2007లోనే డాక్టర్ పళనిస్వామికి 'పద్మశ్రీ' పురస్కారం లభించింది.




## పద్మ భూషణ్



### ప్రొఫెసర్ విజయ్ కుమార్ మల్హోత్రా (మరణానంతరం)

ప్రొఫెసర్ విజయ్ కుమార్ మల్హోత్రా ఒక విశిష్ట భారత రాజకీయవేత్త, విద్యావేత్త, క్రీడారంగ పరిపాలకుడు. దేశ విభజనకు ముందునాటి లాహోర్ లో 1931 డిసెంబరు 3న ఆయన జన్మించారు. హిందీ సాహిత్యంలో ఉన్నత విద్యనభ్యసించి, కవి సోహన్ లాల్ ద్వివేదిపై పరిశోధన ద్వారా 'పీహెచ్డీ' పట్టా పొందారు. ఢిల్లీలోని 'పీజీడీఏవీ' కళాశాలలో సుమారు 36 ఏళ్లపాటు అధ్యాపకత్వం వహించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లతో అనుబంధం నేపథ్యంలో రాజకీయాల్లోనూ మల్హోత్రా చురుగ్గా పని చేశారు. ఢిల్లీ మెట్రోపాలిటన్ కౌన్సిల్ ను 1966లో ఏర్పాటు చేశాక 1967లో ఎన్నికలు నిర్వహించగా కేవలం 35 ఏళ్ల వయసులోనే మల్హోత్రా దానికి ముఖ్య కార్యనిర్వహణ కౌన్సిలర్ గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఐదుసార్లు పార్లమెంటు సభ్యుడుగా, రెండుసార్లు శాసనసభ్యుడుగా ఉన్నారు. అటుపైన 1999 నాటి ఎన్నికల్లో ప్రస్తుత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పై విజయం సాధించారు. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడుగా పని చేయడంతో పాటు క్రీడా పరిపాలన రంగంలో గణనీయ సేవలందించారు. ఆర్చరీ క్రీడకు అంతర్జాతీయ గుర్తింపు తేవడంలో ఎంతగానో కృషి చేశారు. గృహనిర్మాణం, విద్య, క్రీడలు, నిరుపేదలకు పునరావాస కల్పనలో ఆయన పట్టుదల ఢిల్లీ నగర ప్రగతిపై చెరగని ముద్ర వేసింది. ప్రొఫెసర్ విజయ్ కుమార్ మల్హోత్రా 2025 సెప్టెంబరు 30న కన్నుమూశారు.



### పీయూష్ పాండే (మరణానంతరం)

ప్రకటనల పరిశ్రమ రూపాంతరీకరణకు ఆద్యుడైన పీయూష్ పాండే 1955 సెప్టెంబరు 5న జన్మించారు. భారత ప్రకటనల రంగంపై తనదైన ముద్రతో దశాబ్దాల పాటు కీలక పాత్ర పోషించారు. పాండే ప్రభావం సృజనాత్మకతకు పరిమితం కాలేదు.. వ్యూహాత్మక దార్శనికత, పరిశ్రమ నాయకత్వం, సాంస్కృతిక సూక్ష్మ నైపుణ్యాలపై లోతైన అవగాహన దాకా విస్తరించింది. తన కెరీర్ ఆద్యంతం ఎన్నో ప్రతిష్ఠాత్మక ప్రకటనలతో వివిధ ప్రజోపయోగ ప్రచార కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. ముఖ్యంగా పోలియో నిర్మూలనకు ఉద్దేశించిన వ్యాక్సిన్ పై 'దో బూంద్ జిందగీ కీ', 'మిలే సుర్ మేరా తుమ్హారా' వంటివి ప్రకటనలుగా మిగిలిపోకుండా దేశ సాంస్కృతిక వైభవ ప్రతీకలుగా నిలిచిపోయాయి. ఆయన సృజనాత్మక ప్రతిభతో భారతీయ ప్రకటనల పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రభుత్వం 2016లో ఆయనను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. పాండే 2025 అక్టోబరు 24న కన్నుమూసినా ఆయన కృషి, దార్శనికత భవిష్యత్తరాలకు సదా స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. భారతీయ ప్రకటనల ప్రపంచంలో దిగ్గజంగా ఆయన స్థానం చిరస్థాయిగా నిలిచిపోతుంది. ప్రముఖ వాణిజ్య దినపత్రిక 'ది ఎకనమిక్ టైమ్స్' ఆయనను వరుసగా 14 ఏళ్లపాటు దేశంలో అత్యంత ప్రభావశీల ప్రకటనల నిపుణుడిగా ప్రకటించింది. మొత్తం 800కు పైగా జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్న పాండే ప్రకటనల రంగంలో అత్యధిక అవార్డులు పొందిన భారతీయుడుగా రికార్డు సృష్టించారు.



ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

# ఐరోపా నుండి గల్ఫ్ వరకు: ప్రపంచ వేదికపై విస్తరిస్తున్న భారత్ ప్రభావం

*ప్రపంచ వేదికపై భారతదేశ పాత్ర మరింత విస్తరిస్తున్న, అంతర్జాతీయ పరిస్థితులు వేగంగా మారుతున్న సమయంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ దేశాలలో చేసిన పర్యటన భారతదేశం అవలంబిస్తున్న కొత్త ప్రపంచ వ్యూహానికి బలమైన ఉదాహరణగా నిలిచింది. ఇంధన భద్రత, పర్యావరణహిత సాంకేతికత, రక్షణ రంగ సహకారం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, వ్యూహాత్మక భాగస్వామ్యాలు వంటి అనేక కీలక రంగాలను స్పృశించిన ఈ పర్యటన, భారతదేశ జాతీయ ప్రయోజనాలకు కొత్త ఉత్తేజాన్నిచ్చిందని చెప్పవచ్చు. ప్రపంచం నూతన శక్తి సమతుల్యత దిశగా అడుగులు వేస్తున్న ఈ సమయంలో జరిగిన ఈ పర్యటన ద్వారా, భారతదేశం నమ్మకమైన, స్పష్టమైన నిర్ణయాలు తీసుకునే, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే ప్రపంచ భాగస్వామిగా తన స్థానాన్ని మరింత బలపరచుకుంటోందని స్పష్టమవుతోంది.*

మే 15 నుంచి మే 20 వరకు సాగిన ఈ ఐదు దేశాల పర్యటనలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయా దేశాల నాయకులతో ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ పరిణామాలపై విస్తృతంగా చర్చలు జరిపారు. మారుతున్న ప్రపంచ పరిస్థితుల నేపథ్యంలో జరిగిన ఈ కీలక సమావేశాల్లో, భారతదేశ ఆర్థిక, వ్యూహాత్మక, ప్రపంచ ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఇంధన భద్రత, పర్యావరణహిత అభివృద్ధి, రక్షణ సహకారం, సాంకేతిక ఆవిష్కరణలు, డిజిటల్ భాగస్వామ్యం, నీటి నిర్వహణ, పెట్టుబడులు, వాణిజ్య విస్తరణ వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో జరిగిన చర్చలు ఇంధన, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేయగా, ఐరోపా దేశాలతో జరిగిన సమావేశాలు భారతదేశాన్ని నమ్మకమైన భాగస్వామిగా మరింత బలంగా నిలబెట్టాయి. అలాగే, ప్రపంచ వేదికపై భారతదేశ సామర్థ్యాన్ని, నాయకత్వాన్ని ప్రతిబింబిస్తూ, 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా దేశం ముందుకు సాగుతున్న సందేశాన్ని ఈ పర్యటన స్పష్టంగా తెలియజేసింది.

## భారత్-యూఏఈ సంబంధాలు


ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. యూఏఈపై జరిగిన దాడులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా యూఏఈకి భారతదేశం పూర్తి మద్దతుగా ఉంటుందని హామీ ఇస్తూ, అక్కడి నాయకత్వానికి, ప్రజలకు భారతదేశం తరపున సంఘీభావాన్ని తెలిపారు. హార్ముజ్ జలసంధిలో సురక్షితమైన నౌకాయానం, అంతరాయం లేని సముద్ర మార్గాల ప్రాధాన్యాన్ని భారత్ పునరుద్ఘాటించింది. ప్రాంతీయ శాంతి, స్థిరత్వం, అలాగే ఇంధన, ఆహార భద్రతను నిర్ధారించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని భారత్ పేర్కొంది. భారత్-యూఏఈ ఇంధన భాగస్వామ్యం నిరంతరం బలపడుతుండటం పట్ల ఇరు దేశాల నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సహకారాన్ని మరింత విస్తరించేందుకు కొత్త కార్యక్రమాలు చేపట్టాలని అంగీకరించారు. ఈ నేపథ్యంలో ఇండియన్ స్ట్రాటజిక్ పెట్రోలియం రిజర్వ్స్ లిమిటెడ్ (ఐఎస్‌పీఆర్ఎల్), అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ మధ్య కుదిరిన వ్యూహాత్మక సహకార ఒప్పందాన్ని స్వాగతించారు. ఈ ఒప్పందం ప్రకారం, భారతదేశ వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల్లో యూఏఈ వాటా 30 మిలియన్ బారెల్లకు పెరుగుతుంది. అలాగే, భారతదేశంలో వ్యూహాత్మక గ్యాస్ నిల్వల ఏర్పాటుకు కూడా ఇరు దేశాలు కలిసి పని చేయనున్నాయి. భారతదేశంలో యూఏఈ సంస్థలు 5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు చేసిన ప్రకటనను కూడా ఇరు నాయకులు స్వాగతించారు. ఇందులో ఆర్‌బిఎల్ బ్యాంక్‌లో ఎమిరేట్స్ ఎన్‌బిడి పెట్టనున్న 3 బిలియన్ డాలర్ల పెట్టుబడి, నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌లో అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారటీ పెట్టనున్న ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడి, అలాగే సమ్మాన్ క్యాపిటల్‌లో ఇంటర్నేషనల్ హోల్డింగ్ కంపెనీ పెట్టనున్న ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడి ఉన్నాయి. ఈ పెట్టుబడులు భారత్-యూఏఈ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నాయి.

### భారత్- ఇటలీ

ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఆహ్వానం మేరకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటలీలో అధికారిక పర్యటన చేపట్టారు. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య సంబంధాలకు కొత్త ఉత్తేజాన్ని ఇచ్చింది. భారత్-ఇటలీ సంబంధాలను "ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం" స్థాయికి తీసుకెళ్లాలని ఇరు దేశాల నాయకులు నిర్ణయించారు. రాజకీయాలు, ఆర్థిక సహకారం, పెట్టుబడులు, అనుసంధానం, విజ్ఞానశాస్త్రం, సాంకేతికత, ఆవిష్కరణలు, అంకుర సంస్థలు, కృత్రిమ మేధస్సు (ఏఐ), సూపర్ కంప్యూటింగ్, అంతరిక్షం, రక్షణ, భద్రత, సంస్కృతి, విద్యా మార్పిడి వంటి అనేక రంగాల్లో కలిసి పని చేయాలని వారు సంకల్పించారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితిలో తక్షణ సంస్కరణలు అవసరమని ఇరు నాయకులు స్పష్టం చేశారు. అలాగే, హార్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు నిరాటంకంగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రపంచ సరఫరా వ్యవస్థలు సాధారణ స్థితికి రావాలని పిలుపునిచ్చారు. 2029 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ యూరోలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అదేవిధంగా, 2027 సంవత్సరాన్ని "ఇటలీ-భారత్ సంస్కృతి, పర్యాటక సంవత్సరం"గా జరుపుకోవాలనే తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు.

### భారత్-డెన్మార్క్ ద్వైపాక్షిక సహకారం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, డెన్మార్క్ తాత్కాలిక ప్రధాని మెట్టె ఫ్రెడరిక్సన్ తో ఓస్లోలో జరిగిన 3వ ఇండియా-నార్డిక్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా సమావేశమయ్యారు. ఈ ఇద్దరు నాయకులు తమ దేశాల మధ్య ఉన్న ద్వైపాక్షిక సహకారంపై సమీక్ష నిర్వహించారు.పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పుల వంటి కీలక అంశాల్లో సహకారాన్ని పెంపొందించేందుకు రూపొందించిన 'భారత్-డెన్మార్క్ హరిత వ్యూహాత్మక భాగస్వామ్యం' సాధించిన పురోగతిని ఇరు దేశాల నాయకులు అభినందించారు. ఈ భాగస్వామ్యం ద్వారా ఇరు దేశాల మధ్య సహకారం



ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

## ‘రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్’ ప్రదానం



- ఓస్లోలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో, నార్వే రాజు హెరాల్డ్ V చేతుల మీదుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ‘గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది రాయల్ నార్వేజియన్ ఆర్డర్ ఆఫ్ మెరిట్’ పురస్కారం ప్రదానం చేశారు.
- ఈ పురస్కారం నార్వే దేశం విదేశీ దేశాధినేతలు, ప్రముఖ వ్యక్తులకు అందించే అత్యున్నత గౌరవాలలో ఒకటి. నార్వే ప్రయోజనాల కోసం, అలాగే మానవాళి సంక్షేమానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా దీనిని ప్రదానం చేస్తారు.
- ఈ గౌరవాన్ని భారత్-నార్వే దేశాల మధ్య ఉన్న చారిత్రక స్నేహానికి అంకితం చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న అచంచలమైన స్నేహం, పరస్పర నమ్మకం, ఆత్మీయతకు ఇది దక్కిన గౌరవప్రదమైన గుర్తింపుగా ఆయన అభివర్ణించారు.

*ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి*

మరింత బలపడుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. నూతన, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, సమాచార ప్రసారాలు, అధునాతన పరిశోధనలు, స్టార్టప్‌లు, విద్యా రంగాల మార్పిడి వంటి విభాగాల్లో సహకారాన్ని మరింత విస్తరించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆవిష్కరణలు, జ్ఞాన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కలిసి పని చేయాలని అంగీకరించాయి. నీటి నిర్వహణ రంగంలో కూడా ఇరు దేశాల సహకారం సత్ఫలితాలను ఇస్తోందని నాయకులు పేర్కొన్నారు. ముఖ్యంగా వారణాసిలో పరిశుభ్రమైన నదుల కోసం ఏర్పాటు చేసిన ‘స్మార్ట్ ల్యాబ్’ ప్రాజెక్టు విజయవంతంగా కొనసాగుతున్న విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఈ రంగంలో కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని ప్రశంసించారు

### భారత్-నార్వే ద్వైపాక్షిక చర్చలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓస్లోలో నార్వే ప్రధానమంత్రి జోనాస్ గార్ స్టోర్ తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ ఇద్దరు నాయకులు భారత్-నార్వే సంబంధాలను సమీక్షించారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాలు, ఇంధన పరివర్తన (ఎనర్జీ ట్రాన్సిషన్), నీలి ఆర్థిక వ్యవస్థ (సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ), సముద్ర నిర్వహణ, పరిశోధన, ఉన్నత విద్యా రంగాలు, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల అంశాల్లో సహకారం, అంతరిక్షం, ప్రతిభావంతుల పరస్పర రాకపోకలు వంటి అంశాలపై చర్చలు జరిగాయి. సుస్థిర, పర్యావరణహిత ప్రగతికి ఇరు దేశాల ఉమ్మడి నిబద్ధతను చాటుతూ, తమ సంబంధాలను ‘గ్రీన్ స్ట్రాటజిక్ పార్టనర్‌షిప్’ (హరిత వ్యూహాత్మక భాగస్వామ్యం) స్థాయికి పెంచేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. భారత్ – నార్వే మధ్య ప్రస్తుతం ఉన్న వాణిజ్య విలువను 2030 నాటికి రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ఇరు నాయకులు ఉద్ఘాటించారు. అలాగే, టెపా (టీఈపీఏ) ఒప్పందంలో భాగంగా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి నిబద్ధతను చేరుకోవడానికి, భారతదేశంలో పది లక్షల (ఒక మిలియన్) ఉద్యోగాల సృష్టి కోసం వివిధ రంగాలలో చురుకైన భాగస్వామ్యాలతో కలిసి పని చేయాలని వ్యాపార



### ప్రధాని నరేంద్ర మోదీకి ‘అగ్రికోలా పురస్కారం’తో గౌరవం

- రోమ్ లోని ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ప్రధాన కార్యాలయంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి 2026 సంవత్సరానికి గానూ ప్రతిష్టాత్మకమైన ‘అగ్రికోలా మెడల్’ బహుకరించి గౌరవించారు.
- భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వేదికపై కూడా ఆహార భద్రత, స్థిరమైన వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చూపిన అసాధారణ నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.
- ప్రధాని నరేంద్ర మోదీ ఈ గౌరవాన్ని భారతీయ రైతులకు, భారతీయ వ్యవసాయ శాస్త్రవేత్తల రంగానికి అంకితం చేశారు.

*ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి*



ప్రధానమంత్రి పూర్తి కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

## 'మేక్ ఇన్ ఇండియా' నుంచి ప్రపంచ భాగస్వామ్యాల వరకు

ఓస్లోలో నిర్వహించిన 'భారత్-నార్వే బిజినెస్ అండ్ రీసెర్చ్ సమ్మిట్'లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సదస్సుకు 50కి పైగా సంస్థల సీఈఓలు హాజరుకాగా, నార్వే, భారత్ దేశాలకు చెందిన వ్యాపార, పరిశోధన రంగాల నుంచి 250 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సదస్సు ప్రారంభానికి ముందు, ఓస్లోలోని పలు ప్రాంతాల్లో నాలుగు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు. బ్లూ ఎకానమీ (సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ), నౌకల నిర్మాణం, గ్రీన్ ట్రాన్సిషన్, పునరుత్పాదక ఇంధనం, ఆరోగ్య సాంకేతికత, కీలక ఖనిజాలు, స్టార్టప్ లు వంటి కీలక రంగాల్లో భారతదేశంలో పెట్టుబడులను పెంచాలని నార్వే పెట్టుబడిదారులను ప్రోత్సహించారు. కొత్త భాగస్వామ్యాలను ఏర్పరచుకోవాలని, పరస్పర సహకారానికి కొత్త అవకాశాలను అన్వేషించాలని, ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఇరు దేశాల వ్యాపార వర్గాలకు ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు. అదేవిధంగా, ఇంధనం, ఓడరేవులు, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, వాణిజ్యం, సాంకేతికత వంటి విభిన్న రంగాలకు చెందిన ప్రముఖ డచ్ కంపెనీల సీఈఓలతో కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. భారతదేశం సాధిస్తున్న ఆర్థిక పురోగతిపై డచ్ సంస్థలు చూపుతున్న ఆసక్తిని ఆయన అభినందించారు. భారత ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణల కార్యక్రమాన్ని ఆయా పరిశ్రమల ప్రతినిధులు ప్రశంసించగా, భారతదేశంలో పెట్టుబడులు, వ్యాపార విస్తరణకు సంబంధించిన తమ భవిష్యత్ ప్రణాళికలను ప్రధానమంత్రితో పంచుకున్నారు.

### స్వీడన్ వ్యాపార ప్రముఖులతో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ

స్వీడన్ కు చెందిన ప్రముఖ కంపెనీల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భారత్-స్వీడన్ భాగస్వామ్యం నేడు కేవలం ఆర్థిక సంబంధాలకే పరిమితం కాదని, అది సరికొత్త ఆలోచనలు, సాంకేతికత, ఆవిష్కరణలు, ఉమ్మడి సృష్టికి వేదికగా మారిందని ఆయన పేర్కొన్నారు. భారతదేశంలో జరుగుతున్న వేగవంతమైన ఆర్థిక మార్పులను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రభుత్వ సంస్కరణలు, బలమైన దేశీయ డిమాండ్, డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ, తయారీ రంగ అభివృద్ధి, కొత్త తరం మౌలిక వసతుల నిర్మాణం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని వివరించారు. అలాగే 'మేక్ ఇన్ ఇండియా', 'నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్', 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్' వంటి కీలక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని స్వీడన్ సంస్థలను ప్రధానమంత్రి ఆహ్వానించారు. భారతదేశంలో పెట్టుబడులు, సాంకేతిక సహకారం, ఆవిష్కరణల రంగాల్లో తమ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించి, ఉమ్మడి అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

### యూరోపియన్ సంస్థల రౌండ్ టేబుల్ సమావేశం

గోథెన్‌బర్గ్ లో నిర్వహించిన యూరోపియన్ ఇండస్ట్రీ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారత్-ఐరోపా మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక సాన్నిహిత్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారత్-ఈయూ (ఐరోపా సమాఖ్య) సంబంధాలు ఇటీవల కాలంలో సాధించిన పురోగతిని ఆయన స్వాగతిస్తూ, ఇరు పక్షాల మధ్య సహకారం కొత్త స్థాయికి చేరుకుంటోందని పేర్కొన్నారు. పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉత్పాదక రంగాల అభివృద్ధికి భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానాలలో ఒకటిగా ఎదిగిందని ప్రధాని చెప్పారు. వేగవంతమైన ఆర్థిక వృద్ధి, సంస్కరణలు, అనుకూల వ్యాపార వాతావరణం దేశాన్ని పెట్టుబడులకు మరింత అనువైన కేంద్రంగా మార్చాయని ఆయన వివరించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన దృఢమైన, సురక్షితమైన సరఫరా గొలుసుల నిర్మాణంలో భారత్, ఐరోపా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి అభిప్రాయపడ్డారు. పరస్పర సహకారం ద్వారా ప్రపంచ సరఫరా వ్యవస్థలను మరింత స్థిరంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దవచ్చని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రపంచ ఆర్థిక వృద్ధికి భారతదేశ యువ, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి ప్రధాన బలంగా నిలుస్తుందని ప్రధాని మోదీ చెప్పారు.

ప్రతినిధులను వారు ప్రోత్సహించారు. జూన్ 2026లో ఫ్రాన్స్ లో జరగనున్న 'ఇండియా ఇన్నోవేట్స్ 2026' కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా భారత్ నార్వేను ఆహ్వానించింది. అలాగే ఇరు దేశాల మధ్య ఒక 'స్టార్టప్ ఇన్నోవేషన్ హబ్', 'గ్రీన్ ఇన్నోవేషన్ హ్యాకథాన్' ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు చేశారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని ముక్తకంఠంతో ఖండించాలని ఇరు దేశాల నేతలు అభిప్రాయపడ్డారు.

### భారత్- నెదర్లాండ్స్ మధ్య చర్చలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్ తో ఆయన అధికారిక నివాసం (Catshuis) లో చర్చలు జరిపారు. భారత్-నెదర్లాండ్స్ సంబంధాలను బలోపేతం చేయడంపై ఇద్దరు ప్రధానులు విస్తృత స్థాయి చర్చలు నిర్వహించారు. ఇరు దేశాల మధ్య ఉన్న ఉమ్మడి విలువలు, పరస్పర నమ్మకం, అలాగే పెరుగుతున్న సాన్నిహిత్యం, సహకారాన్ని దృష్టిలో



## ప్రధానమంత్రి నరేంద్ర మోదీని గౌరవించిన స్వీడన్

- స్వీడన్ లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో, స్వీడన్ యువరాణి విక్టోరియా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి 'రాయల్ ఆర్డర్ ఆఫ్ ది పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్' పురస్కారాన్ని అందజేశారు.
- ఇది 18వ శతాబ్దంలో స్థాపించిన స్వీడన్ దేశ అత్యంత ప్రాచీనమైన, ప్రతిష్ఠాత్మకమైన పురస్కారాల్లో ఒకటి.
- అసాధారణ ప్రజా సేవ అందించినందుకు, స్వీడన్ తో సంబంధాలను బలోపేతం చేసినందుకు గానూ, విదేశీ ప్రభుత్వ అధినేతలకు స్వీడన్ దేశం అందించే అత్యున్నత గౌరవానికి ఈ పురస్కారం ప్రతీకగా నిలుస్తుంది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ గౌరవాన్ని 140 కోట్ల భారత ప్రజలకు, భారత్-స్వీడన్ మధ్య ఉన్న శాశ్వత స్నేహానికి అంకితం చేశారు.





## చోళుల రాగి శాసనాల అప్పగింత

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్ సమక్షంలో.. లైడెన్ విశ్వవిద్యాలయ గ్రంథాలయం 11వ శతాబ్దానికి చెందిన చోళుల రాగి శాసనాలను భారత ప్రభుత్వానికి తిరిగి అప్పగించింది. 21 పెద్ద శాసనాలు, 3 చిన్న శాసనాలతో కూడిన ఈ చోళుల రాగి శాసనాలు, 11వ శతాబ్దంలో చోళ రాజులు జారీ చేసిన రాజ శాసనాలు. ఈ రాగి రేకులపై ఉన్న వచనాలు తమిళం, సంస్కృత భాషలలో లిఖించబడి ఉన్నాయి.

ఉంచుకుని ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే కీలక ముందడుగుగా భావిస్తున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, కీలక సాంకేతికతలు, సముద్ర రంగం, పునరుత్పాదక ఇంధనం, విద్య వంటి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడానికి ఇరు దేశాలు అంగీకరించాయి. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు (ఏఐ), సెమీకండక్టర్లు వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చాయి. ఉపాధి, విద్య కోసం పరస్పర రాకపోకలను ప్రోత్సహించే 'మొబిలిటీ పార్టనర్‌షిప్'తో పాటు, ఉన్నత విద్యా రంగంలో సహకారాన్ని బలోపేతం చేసే కొత్త కార్యక్రమాలకు ఇరు దేశాల ప్రధానమంత్రులు తమ మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలో నలంద విశ్వవిద్యాలయం, గ్రోనింగెన్ విశ్వవిద్యాలయం మధ్య కుదిరిన ఒప్పందాన్ని వారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. అధికారిక చర్చల అనంతరం.. సాంకేతికత, హరిత ఇంధనం, వాణిజ్యం, రవాణా (మొబిలిటీ), నీరు, వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, సంస్కృతి వంటి రంగాలలో 14 అవగాహన పూర్వక ఒప్పంద (MoUs) పత్రాలపై సంతకాలు జరిగాయి.

అంతర్జాతీయ ఎమ్ఎస్ఎమ్ఈ దినోత్సవం - జూన్ 27, 2026

# సామాజిక - ఆర్థికాభివృద్ధికి ఎమ్ఎస్ఎమ్ఈలు మూలస్తంభాలు

*సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎమ్ఎస్ఎమ్ఈ) రంగం భారతదేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కీలకమైన ఆధారస్తంభంగా నిలుస్తోంది. తక్కువ పెట్టుబడులతో ఎక్కువ ఉపాధి అవకాశాలను కల్పించే ఈ రంగం, పెద్ద పరిశ్రమలకు అనుబంధంగా పనిచేస్తూ దేశ పారిశ్రామిక వ్యవస్థకు బలాన్ని అందిస్తోంది. అంతేకాకుండా, గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధిని ప్రోత్సహించి, ప్రాంతీయ సమతుల అభివృద్ధికి దోహదపడుతోంది. ప్రతి సంవత్సరం జూన్ 27న అంతర్జాతీయ ఎమ్ఎస్ఎమ్ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఎమ్ఎస్ఎమ్ఈ ల ప్రాధాన్యాన్ని, గుర్తుచేసుకుంటూ, వాటి అభివృద్ధికి అవసరమైన చర్యలపై దృష్టి సారిస్తారు. భారత ప్రభుత్వ ఎమ్ఎస్ఎమ్ఈ మంత్రిత్వ శాఖ కూడా వివిధ సంస్థలు, విద్యాసంస్థలతో కలిసి ఈ రంగం వృద్ధి, సామర్థ్య పెంపు, ఆవిష్కరణలు, ఉపాధి సృష్టికి నిరంతరం కృషి చేస్తోంది.*



## స్వదేశీ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న ఎమ్ఎస్ఎమ్ఈ లు

- దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ఎమ్ఎస్ఎమ్ఈ ల వాటా 31 శాతానికి పైగా ఉండగా, ఎగుమతుల్లో వీటి వాటా 48.58 శాతంగా ఉంది.
- దేశవ్యాప్తంగా సుమారు 32.8 కోట్ల మంది ప్రజల జీవనోపాధి ఈ ఎమ్ఎస్ఎమ్ఈ ల పైనే ఆధారపడి ఉంది. ఇప్పటివరకు 7.9 కోట్ల కంటే ఎక్కువ సంస్థలు వ్యవస్థీకృత ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యాయి.
- 'GeM' (జెమ్), 'TReDS' (ట్రెడ్స్), 'SAMADHAAN' (సమాధాన్) వంటి డిజిటల్ వేదికల ద్వారా మార్కెట్ అవకాశాలను పొందడంలో, చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయడంలో ఎమ్ఎస్ఎమ్ఈ లకు అవసరమైన సహాయం అందుతోంది.



> "భారతదేశ తయారీ రంగం, పారిశ్రామిక వృద్ధికి మన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగం వెన్నెముకగా నిలుస్తోంది. 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత, ప్రభుత్వం 2020లో ఎమ్ఎస్ఎమ్ఈ ల నిర్వచనాన్ని సవరించే కీలక నిర్ణయం తీసుకుంది. తమ కార్యకలాపాలను విస్తరిస్తే ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు నిలచిపోతాయేమోనని ఎమ్ఎస్ఎమ్ఈ లలో ఉన్న ఆందోళనను ఈ నిర్ణయం సమర్థవంతంగా తొలగించింది.
>
> *నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి*


న్యూ ఇండియా
సమాచార్
పక్ష పత్రిక

**RNI NO.: DELTEL/2020/78829 JUNE 16-30, 2026**
RNI Registered No DELTEL/2020/78829 (Publishing Date: June 05, 2026 Pages: 36)

**EDITOR IN CHIEF**
**Dhirendra Ojha**
Principal Director General
Press Information Bureau, New Delhi

**PUBLISHER:**
**Kanchan Prasad**
Director General, on behalf of
Central Bureau Of Communication

**PUBLISHED FROM:**
Room No–278, Central Bureau Of Communication, 2nd Floor, Soochna Bhawan, New Delhi -110003